12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 13 సంచిక : 46 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 20 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :46 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 20 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




### రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి

## చంద్రబాబు దసరా శుభాకాంక్షలు

- నేడు విజయదశమి
- చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా
- ఈ పండుగ గొప్ప స్ఫూర్తిని ఇస్తుందన్న సీఎం చంద్రబాబు
- తమ ప్రభుత్వం చేస్తున్న సంకల్పానికి జగన్మాత అనుగ్రహం లభించాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడి

- మిగతా 2లో



## సెలవు

పాఠకులకు, ప్రకటన కర్తలకు, మిత్రులు, శ్రేయోభిలాషులకు దసరా శుభాకాంక్షలు. దసరా పండుగ సందర్భంగా మంగళవారం పత్రికకు సెలవు. బుధవారం పునః ప్రారంభం.

### స్థానిక సంస్థల్లోనూ కూటమికి

# జై కొట్టండి

## సీఎం చంద్రబాబు పిలుపు

- ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి మూడు రెట్ల వేగంతో సాగుతుందని హామీ
- అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 63.6 శాతం స్థానాలు కేటాయింపు
- విద్యావంతులకు, విధ్వంసకారులకు మధ్య జరుగుతున్న పోరు ఈ ఎన్నికలు
- గత ప్రభుత్వ హయాంలోని అరాచకాలపై వీడియోలను ప్రదర్శించిన ముఖ్యమంత్రి



సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమికి పట్టం కడితే, కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాల కలయికతో 'ట్రిపుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్ఠం చేసేలా ఈ ఎన్నికల ఫలితాలు ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలతో క్షేత్రస్థాయిలో నాయకత్వం బలపడుతుందని, అందుకే సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో అభ్యర్థుల ఎంపికలో ఎన్నడూ లేనంత కసరత్తు చేస్తున్నామని వివరించారు.

పట్టణ స్థానిక ఎన్నికల్లో మాదిరిగానే గ్రామీణ ఎన్నికల్లోనూ ఇదే స్థాయిలో కసరత్తు చేస్తామన్నారు. 'ఆయారాం గయారాం' సంస్కృతికి స్వస్తి పలుకుతూ, మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభీష్టానికి ప్రాధాన్యతనిస్తూ, సామాజిక పునరేకీకరణ (సోషల్ రీ-ఇంజనీరింగ్) చేపట్టామని చెప్పారు. ఇందులో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 63.6 శాతం స్థానాలు కేటాయించామని, ఒక్క బీసీలకే 35 శాతానికి పైగా సీట్లు ఇచ్చి పెద్దపీట వేశామని వెల్లడించారు. విద్యావంతులు, యువత, మహిళలు, పార్టీకి సేవలందించిన వారికే టికెట్లు ఇచ్చామని,

- మిగతా 2లో



### 22 మున్సిపాలిటీల్లో ఎన్నికలు

# వాయిదా వేయండి

## ఈసీకి వైసీపీ వినతి

- 22 మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా వేయాలని ఈసీని కోరిన వైసీపీ
- టీడీపీ దాడులతో నామినేషన్లు వేయలేకపోయామని ఆరోపణ
- హింసాత్మక ఘటనలపై ఎన్నికల కమిషనర్‌కు వీడియో ఆధారాలు అందజేత
- 488 వార్డుల్లో అభ్యర్థులు లేకుండా పోయారని ఫిర్యాదులో వెల్లడి
- కుప్పం ఛైర్మన్ అభ్యర్థి కిడ్నాప్ అయ్యారని, పలువురిపై దాడులు జరిగాయని ఆందోళన

రాష్ట్రంలోని 22 పట్టణ స్థానిక సంస్థల్లో కొత్తగా నామినేషన్లు స్వీకరించాలని లేదా ఎన్నికలను వాయిదా వేయాలని వైసీపీ నేడు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్ఈసీ) కోరింది. అధికార టీడీపీ దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతూ తమ అభ్యర్థులను

- మిగతా 2లో




## ఎడిటర్ వ్యూ

### ఏపీ లోకల్ వార్... స్నేహపూర్వక పోటీ తప్పట్లేదే... !

రాష్ట్రంలో కూటమి పార్టీల మధ్య సఖ్యత బాగానే ఉన్నప్పటికీ.. స్థానిక ఎన్నికల్లో మాత్రం స్నేహ పూర్వక పోటీ తప్పేలా కనిపించడం లేదు. ఉత్తరాంధ్ర నుంచి సీమ వరకు జనసేన నాయకులు ఎక్కడా తగ్గలేదు. అధికారికంగా పార్టీకి 4 కార్పొరేషన్లు, 21 మునిసిపాలిటీలే దక్కినా.. క్షేత్రస్థాయి నాయకులు, పార్టీ కోసం పనిచేసిన వారు మాత్రం సై అంటూ ఈ ఎన్నికల్లో సీట్ల కేటాయింపుతో సంబంధం లేకుండానే రంగంలోకి దిగారు. దీంతో ఆయా స్థానాల్లో మిత్ర బేధం రాకుండా.. స్నేహ పూర్వక పోటీ చేయడమే మంచిదన్న భావన వ్యక్తమవుతోంది.

**ఎక్కడెక్కడ ?**

మూడుచోట్ల మేయర్ స్థానాలకు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఛైర్‌పర్సన్ స్థానాలకు.. టీడీపీ–జనసేన, బీజేపీ–జనసేన, టీడీపీ–బీజేపీల మధ్యే పోరు సాగనుంది. ఆయా పార్టీలనేతలు కాదు కాదంటూనే నామినేషన్లు వేసేశారు. అదేమంటే తమకు బలం ఉన్న స్థానాలను వేరే పార్టీలకు కేటాయించారని కూడా చెబుతున్నారు. ఇక,ఒకటి రెండు స్థానాల్లో అయితే.. ఒకే పార్టీకి చెందిన నాయకులు ఇద్దరి నుంచి ముగ్గరు వరకు పోటీ పడుతున్నా రు. ఈ పరిణామాలు.. ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ.. నాయకుల మధ్య ఉన్న ఆకాంక్షకు అద్దం పడుతున్నాయి.ముఖ్యంగా విజయనగరం కార్పొరేషన్ మేయర్ పదవికి టీడీపీ, జనసేన పోటీ పడుతున్నాయి. వాస్తవానికి టీడీపీకే కేటాయించినా.. జనసేన మాత్రం తగ్గేది లేదంటూ పోటీకి దిగింది. ఇక, డివిజన్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పది డివిజన్లలో జనసేన నామినేషన్ వేసింది. ఏలూరు కార్పొరేషన్ జనసేనకు కేటాయించగా టీడీపీ అభ్యర్థి కూడా మేయర్ పీఠానికి నామినేషన్ వేశారు. విశాఖ కార్పొరేషన్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మరో కీలకమైన విజయవాడ కార్పొరేషన్ పరిధిలోనూ జనసేన, టీడీపీలు వార్డుల వారీగా నామినేషన్లు వేశాయి.

**ఏం చేయాలి ..?**

ఇలా కూటమి పార్టీల నాయకులే విరివిగా నామినేషన్లు వేయడంతో అనివార్యంగా పోటీ తప్పకపోవచ్చు. ఇలాంటి సమయంలో నామినేషన్లను ఉపసంహరించుకునేలా నాయకులను బుజ్జగించడం తొలి మార్గం. అప్పటికీ సాధ్యం కాకపోతే.. పార్టీ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం. అది కూడావర్కవుట్ అవకపోతే.. స్నేహపూర్వ కంగానే ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. మంచి–చెడులను ప్రజలే తేలుస్తారు. మొత్తంగా.. ఆయా ప్రాంతాల్లో స్నేహ పూర్వక పోటీ తప్పదన్న సంకేతాలు అయితే వస్తున్నాయి. అయితే.. ఉపసంహరణకు గడువు ఉన్న నేపథ్యంలో ఏం చేస్తారన్నది చూడాలి.

### ఒక్క ఓటు కూడా చీలకూడదు.. విజయవాడలో వంగవీటి రాధాను గెలిపించుకుందాం

- మొదటి పేజి తరువాయి

రాధా అభ్యర్థిత్వంపై టీడీపీలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లుగా సాగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, అది పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పింది. ఈ మేరకు టీడీపీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. "కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందరూ చూస్తున్నారు. ఇప్పుడు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా కూటమి అభ్యర్థినే గెలిపించుకుందాం," అని పిలుపునిచ్చింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడిగా బరిలో నిలిపిన వంగవీటి రాధాకృష్ణను తిరుగులేని మెజార్టీతో గెలిపించాలని కోరింది. కులాల పేరుతో రెచ్చగొట్టి ఓట్లు చీల్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి కుట్రలను తిప్పికొట్టాలని టీడీపీ తన ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. "కులం పేరుతో ఎవరు ఎన్ని విధాలుగా రెచ్చగొట్టినా కూటమి ఓటు చీలకుండా మన అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణను గెలిపించుకుందాం. కులతత్వం రెచ్చగొడుతున్న వారికి దీటుగా సమాధానం ఇద్దాం" అని పార్టీ శ్రేణులకు, ప్రజలకు స్పష్టం చేసింది. రాధా గెలుపు కోసం కూటమిలోని మూడు పార్టీలు కలిసికట్టుగా పనిచేస్తాయని, ఆయన విజయంతో విజయవాడ కార్పొరేషన్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని టీడీపీ భరోసా ఇచ్చింది.

### అమెరికాలోని ప్రతి పిల్లాడికీ స్పేస్‌ఎక్స్ షేరు..

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ప్రముఖ కృత్రిమ మేధ సంస్థ ఆంథ్రోపిక్.. కంపెనీలోని 5 శాతం వాటాను ప్రజాప్రయోజనాల కోసం తాను ఏర్పాటు చేసే నిధికి కేటాయించనున్నట్లు ప్రకటించిన వేళ ఎలాన్ మస్క్ స్పందిస్తూ ఈ ప్రకటన చేశారు.'ఆంథ్రోపిక్ పబ్లిక్ బెనిఫిట్ ఫండ్' ను ఏర్పాటు చేసి సంస్థలో 5 శాతం వాటాలను ఈ నిధికి కేటాయిస్తామని ఆంథ్రోపిక్ ప్రకటించింది. సంస్థ విలువ 50 శాతం పెరిగిన ప్రతిసారీ మరో 2 శాతం వాటాలను అదనంగా కేటాయించనున్నట్లు తెలిపింది. ఈ నిధి ద్వారా స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు అందించడంతో పాటు అవసరమైన వర్గాలకు ఆర్థిక సాయం చేయనున్నారు. అదేవిధంగా ఏఐ వల్ల ఉద్యోగ రంగంలో వచ్చే మార్పులు, కార్మికులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంపైనా దృష్టి సారించనున్నట్లు ఆంథ్రోపిక్ తెలిపింది.ఈ ప్రకటనపై మస్క్ స్పందిస్తూ.. వాటాలను ప్రజానిధికి చేరవేసే బదులు.. నేరుగా ప్రజలకే ఇవ్వాలని ఎక్స్ వేదికగా సూచించారు. 'నేను కూడా భవిష్యత్‌లో ఇదే చేయబోతున్నా' అని ప్రకటించారు. ఏ కంపెనీ షేర్లు అనేది తొలుత వెల్లడించనప్పటికీ.. తర్వాత స్పేస్‌ఎక్స్‌లో ఒక్కో షేరును ప్రతి పిల్లాడికీ కేటాయించనున్నట్లు మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత స్పేస్ ఎక్స్ షేరు ధర 146.03 డాలర్లు ఉంది.

# స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి

ప్రతి మేయర్ స్థానాన్ని ఒక్కో సామాజిక వర్గానికి కేటాయించామని చంద్రబాబు పేర్కొన్నారు.

**చెప్పాం.. చేస్తున్నాం..**

2024 సార్వత్రిక ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్‌తో కలిసి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, ఇది అతిపెద్ద నగదు బదిలీ కార్యక్రమమని కొనియాడారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, దీపం–2.0 వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. విశాఖ, విజయవాడల్లో సంపూర్ణ హక్కులతో ఇళ్ల పట్టాలు, 'రాజముద్ర'తో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, డేటా సెంటర్ల నుంచి డిఫెన్స్ ప్రాజెక్టుల వరకు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2029 నాటికి 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, గోదావరి–కావేరి అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య పోటీ**

ఈ స్థానిక ఎన్నికలు విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య జరుగుతున్న పోటీ అని చంద్రబాబు అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమమే ఎన్డీఏ అజెండా అయితే, హింసను ప్రేరేపించడమే 'గొడ్డలి పార్టీ' విధానమని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓడినా ఆ పార్టీకి బుద్ధి రాలేదని, స్థానిక ఎన్నికల్లోనూ విధ్వంసానికే ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు.

**గొడ్డలి పార్టీ అధ్యక్షుడు**

తన అవినీతి, అక్రమాల నుంచి రక్షణ పొందేందుకే 'జెన్–జీ' అంటున్నారని, వారిని పావులుగా వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. "గొడ్డలి పార్టీ చేసిన అకృత్యాల నుంచి జెన్–జీ కాపాడాలా?" అని ప్రశ్నించారు.

గత ప్రభుత్వ హయాంలో నాటి అక్రమాలను ప్రశ్నించిన ఎస్ఈసీపైనే ఎదురుదాడి చేసి, ఆయన ప్రాణరక్షణ కోసం కేంద్రాన్ని ఆశ్రయించే దుస్థితి కల్పించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో భూములను దోపిడీ చేయాలని చూశారని, ప్రజల ఆస్తులపై నాటి సీఎం తన బొమ్మలు వేసుకున్నారని విమర్శించారు. దేవాలయాలను అపవిత్రం చేసి, కల్తీ ప్రసాదాలు తయారు చేయించారని, ప్రస్తుతం తాము పవిత్ర వాతావరణాన్ని నెలకొల్పుతున్నామని చెప్పారు.

## 22 మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా వేయండి

నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ వైసీపీ నేతల బృందం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను కలిసి ఫిర్యాదు చేసింది.వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, నారాయణమూర్తి తదితరులు కమిషనర్‌ను కలిసి దాడులకు సంబంధించిన వీడియో ఆధారాలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను, మూడు వినతిపత్రాలను సమర్పించారు. అనంతరం అప్పిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఓటమి భయంతోనే టీడీపీ కార్యకర్తలు తమ నామినేషన్ పత్రాలను చించివేశారని, కొన్నిచోట్ల పోలీసులు వారికి సహకరించగా, మరికొన్ని ప్రాంతాల్లో పోలీసులే స్వయంగా పత్రాలను లాక్కున్నారని ఆరోపించారు.ఈ 22 పురపాలక సంఘాల్లో మొత్తం 809 వార్డులు/డివిజన్లు ఉండగా, కేవలం 321 చోట్ల మాత్రమే తమ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగలిగారని వైసీపీ వివరించింది. మిగిలిన 488 చోట్ల తమ పార్టీ తరపున అభ్యర్థులే లేకుండా చేశారని, 8 మున్సిపల్ ఛైర్మన్ పదవులకు కూడా నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని తెలిపింది. మైదుకూరులో 19 నామినేషన్ పత్రాలను చించివేసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం అక్కడ ఎన్నికలను వాయిదా వేసిందని, అదే తరహా చర్యలు ఈ 22 ప్రాంతాల్లోనూ తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎంపీలు మిథున్ రెడ్డి, గురుమూర్తి, అవినాశ్ రెడ్డిపై జరిగిన దాడులను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆత్మకూరు, కనిగిరిలో స్క్రూటినీ కేంద్రాల్లోనే నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. ప్రొద్దుటూరు, కుప్పంలో వైసీపీ కార్యకర్తలపై దాడులు జరిగాయని, కుప్పంలో ఛైర్మన్ అభ్యర్థి విజయ్ కుమార్ అపహరణకు గురయ్యారని, ఆయన ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అపహరణకు గురైన అభ్యర్థులను వెంటనే కాపాడి, వారి కుటుంబాలకు రక్షణ కల్పించాలని కోరారు.సీసీటీవీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలన్న హైకోర్టు ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని, హింసకు పాల్పడిన టీడీపీ నేతలపై కేసులు నమోదు చేయాలని, వారికి సహకరించిన అధికారులను ఎన్నికల విధుల నుంచి తక్షణమే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి మేయర్ అభ్యర్థి వాసు యాదవ్ బీసీ సర్టిఫికెట్ల అంశాన్ని నిబంధనల ప్రకారం, ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేకుండా పరిశీలించాలని కోరారు. ఏకగ్రీవాలను ప్రకటించే ముందు బాధితులైన తమ అభ్యర్థులకు మరోసారి అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు.

## రోడ్డు వేస్తే ట్రాక్టర్ తో దున్నేశారు.. ఇదేం పైశాచిక ఆనందం?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం వేసిన రోడ్డును కొందరు ట్రాక్టర్‌తో దున్నేశారని, ఇది వారి పైశాచిక ఆనందానికి, ఉన్మాదానికి నిదర్శనమని తీవ్రంగా మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉండవల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈరోజు టీవీలో చూశాను. మేం రోడ్లు వేస్తే, ఆ రోడ్డును ట్రాక్టర్‌తో దున్నేశారు. ఇది భరించలేక చేస్తున్నారా, లేక ఉన్మాదమో, పైశాచిక ఆనందమో నాకు అర్థం కావడం లేదు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.ఓవైపు తాము అభివృద్ధి, జవాబుదారీ పాలన అందిస్తుంటే, మరోవైపు కొందరు విధ్వంసానికే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం 55 రకాల సేవలను అందిస్తోందని, ఆర్టీసీ బస్సులు, ఆసుపత్రులు, అన్నా క్యాంటీన్లు, రేషన్ షాపుల వరకు ప్రతి సేవపైనా ప్రజల అభిప్రాయం తీసుకుంటున్నామని తెలిపారు. ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరించి, అధికారుల పనితీరును సమీక్షిస్తున్నామని అన్నారు. నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో అధికారుల ముందే వారి పనితీరుపై ప్రజల అభిప్రాయాలను చదివి వినిపిస్తూ, తప్పు చేస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్నామని, ఇంతకంటే జవాబుదారీతనం ఎక్కడా ఉండదని స్పష్టం చేశారు.

రాజకీయ విధ్వంసం కారణంగా కోల్పోయిన 'బ్రాండ్ ఏపీ'ని మళ్లీ పునరుద్ధరించి, పెట్టుబడులకు రాష్ట్రాని నంబర్ వన్ గమ్య స్థానంగా తీర్చిదిద్దామని చంద్రబాబు అన్నారు. గత రెండున్నర ఏళ్లలో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, ఇవి పూర్తయితే 20 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించే బృహత్తర కార్యక్రమానికి నాంది పలికామని, దీనివల్ల కరవు పరిస్థితుల్లోనూ నీటి సమస్య ఉండదని చెప్పారు.మెగా డీఎస్సీ విషయంలో ప్రతిపక్షాలు వ్యవహరించిన తీరును చంద్రబాబు తీవ్రంగా తప్పుపట్టారు. "పేద పిల్లలకు ఉద్యోగాలు రాకుండా ఉండేందుకు సుమారు 200–300 సార్లు కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని చూశారు. మేం పట్టుబట్టి ఉద్యోగాలు ఇస్తే, మాపైనే ఆరోపణలు చేశారు. నిజం నిప్పు లాంటిది. దానితో ఆడుకుంటే మసైపోతారే తప్ప నిలవలేరు" అని హెచ్చరించారు. ఒకప్పుడు ఎడారిగా మారుతుందనుకున్న రాయలసీమ, నేడు తమ ప్రభుత్వ కృషితో 'రాయలసీమ రైజింగ్'గా ఎదుగుతోందని పేర్కొన్నారు. టెక్నాలజీని ఉపయోగించి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## పాకిస్థాన్‌లో ఆకలి కేకలు.. నివేదికలో షాకింగ్ విషయాలు!

ప్రపంచవ్యాప్తంగా ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న టాప్ 10 దేశాల జాబితాలో పాకిస్థాన్ చేరింది. ఆర్థిక ఒత్తిళ్లు, వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలు, సహాయం అందడంలో తగ్గుదల వంటి కారణాలతో ఆ దేశంలో ఆహార అభద్రత రోజురోజుకు తీవ్రమవుతోందని ఒక నివేదిక హెచ్చరించింది. 'ప్రాఫిట్ బై పాకిస్థాన్ టుడే' విశ్లేషణ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 47 దేశాల్లో 266 మిలియన్ల మంది తీవ్రమైన ఆకలితో అల్లాడుతున్నారు. ఈ సంఖ్య దశాబ్దం క్రితంతో పోలిస్తే రెట్టింపు కావడం గమనార్హం.తీవ్ర ఆహార సంక్షోభంతో బాధపడుతున్న వారిలో దాదాపు మూడింట రెండొంతుల మంది, అంటే సుమారు 177 మిలియన్ల ప్రజలు కేవలం పది దేశాల్లోనే ఉన్నారు. ఆ జాబితాలో పాకిస్థాన్‌తో పాటు ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, నైజీరియా, కాంగో, సూడాన్, యెమెన్, మయన్మార్, దక్షిణ సూడాన్, సిరియా ఉన్నాయి. జనాభా శాతంతో కాకుండా, ఆకలితో బాధపడుతున్న ప్రజల సంఖ్య ఆధారంగా పాకిస్థాన్‌ను ఈ జాబితాలో చేర్చినట్లు నివేదిక స్పష్టం చేసింది. పాకిస్థాన్‌లోని 51 గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 1.06 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బలహీన వర్గాలు వాతావరణ మార్పుల ప్రభావానికి ఎక్కువగా గురవుతున్నాయి. 2018–19లో 15.92 శాతంగా ఉన్న మధ్యస్థ, తీవ్ర ఆహార అభద్రత కలిగిన కుటుంబాల సంఖ్య, 2024–25 నాటికి 24.35 శాతానికి పెరిగింది. అంటే.. ప్రస్తుతం దేశంలో దాదాపు ప్రతి నాలుగు కుటుంబాల్లో ఒక కుటుంబం ఆహార కొరతతో ఇబ్బంది పడుతోంది. ఇదే సమయంలో తీవ్రమైన ఆహార అభద్రత 2.37 శాతం నుంచి 5.04 శాతానికి పెరిగి రెట్టింపయింది. పాకిస్థాన్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (పీబీఎస్) గణాంకాల ప్రకారం.. జూన్ 2019 నుంచి జూన్ 2025 మధ్య కాలంలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) 117 శాతం పెరగడం ఆర్థిక ఒత్తిళ్లకు అద్దం పడుతోంది. దీనికి తోడు వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గి, గ్రామీణ కుటుంబాల ఆదాయంపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో ప్రజలు ఆహారం కోసం మార్కెట్లపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. ఈ కాలంలో ప్రజలు గోధుమలు, బియ్యం, పప్పులు, మాంసం, గుడ్లు, పాల వినియోగాన్ని తగ్గించారని, అయితే వనస్పతి నెయ్యి వాడకం మాత్రం 81 శాతం పెరిగిందని నివేదిక పేర్కొంది. ఆదాయం తగ్గడం, ధరలు పెరగడం వంటి కారణాలతో పాక్‌లో ఆహార లభ్యత, కొనుగోలు సామర్థ్యం రెండూ దెబ్బతిన్నాయి.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు.. శాంతికి తాము సిద్ధమేనన్న జెలెన్‌స్కీ

- మొదటి పేజి తరువాయి

కానీ రష్యా హింసామార్గం వీడటం లేదని ఆయన ఆరోపించారు.రష్యా సైన్యం బాలిస్టిక్ క్షిపణులు, వివిధ రకాల డ్రోన్లతో కీవ్‌తో పాటు పలు నగరాలపై విరుచుకుపడిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా తాము ఎదురుదాడికి దిగాల్సి వస్తోందని చెప్పారు. విన్నిట్సియా, కీవ్, మైకోలైవ్, ఖార్కివ్, ఒడెస్సా సహా 11 ప్రాంతాల్లోని ఇంధన మౌలిక సదుపాయాల కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని, వీటిలో పదికి పైగా కేంద్రాలు ధ్వంసమయ్యాయని జెలెన్‌స్కీ పేర్కొన్నారు."మేం ఈ యుద్ధాన్ని ఎన్నడూ కోరుకోలేదు. గౌరవప్రదంగా యుద్ధాన్ని ముగించేందుకు మా మిత్ర దేశాలు చేసిన ప్రతి ప్రయత్నాన్ని స్వాగతించాం. కానీ రష్యా మాత్రం పదేపదే బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్ దాడులు, హత్యలతోనే ప్రతిస్పందిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపేందుకు లేదా ఉద్రిక్తతలను తగ్గించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఏమాత్రం ఆసక్తి లేదని ఆయన విమర్శించారు.గత కొంతకాలంగా అమెరికా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు పరోక్షంగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాస్కోపై ఉన్న ఆంక్షలను వాషింగ్టన్ సడలించడం, రష్యా నుంచి డీజిల్ దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం చేసుకోవడం వంటి చర్యలను ఆయన తప్పుబట్టారు. రష్యా దాడులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని గతంలో పంచుకున్న భాగస్వామ్య దేశాలు, ఇప్పుడు ఆ విషయంలో మౌనం వహిస్తున్నాయని వాపోయారు. అమెరికా తయారీ 'పేట్రియాట్' గగనతల రక్షణ వ్యవస్థల కొరత కూడా తమ దేశాన్ని రక్షణ పరంగా మరింత బలహీన పరిచిందని ఆయన పేర్కొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా శుభాకాంక్షలు

నేడు (అక్టోబరు 20) విజయదశమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ గొప్ప స్ఫూర్తిని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పండుగ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ మేరకు చంద్రబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతన్నల శ్రమకు తగిన ఫలితం, మహిళలకు సాధికారత, యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు తమ ప్రభుత్వం చేస్తున్న సంకల్పానికి జగన్మాత అనుగ్రహం లభించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు."ఆ కనకదుర్గమ్మ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలి. ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు.

### హైదరాబాద్‌లో హనీట్రాప్

- మొదటి పేజి తరువాయి

బ్లాక్‌మెయిల్ చేసిన పవన్ అనే నిందితుడిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడి వలలో వందలాది మంది బాధితులు చిక్కుకున్నట్లు పోలీసులు గుర్తించా రు.పవన్ అనే యువకుడు వాట్సాప్‌లో యువతి పేరుతో నకిలీ ప్రొఫైల్ సృష్టించి, ఒక పోలీసు అధికారితో స్నేహం చేశాడు. చాటింగ్ ద్వారా కొంతకాలం నమ్మకాన్ని కలిగించిన అనంతరం, సదరు అధికారిని బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బు డిమాండ్ చేయడం ప్రారంభించాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రంగంలోకి దిగిన సైదాబాద్ పోలీసులు సాంకేతిక ఆధారాల సాయంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను చార్మినార్ డీసీపీ కిరణ్ ఖరే సోమవారం మీడియాకు వెల్లడించారు. నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి, అతని నేర చరిత్రను వివరించారు. నిందితుడి మొబైల్ ఫోన్‌ను విశ్లేషించగా వేల సంఖ్యలో వాట్సాప్ చాటింగ్‌లు లభ్యమయ్యాయి. అతని బాధితుల జాబితాలో వందలాది మంది ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.నిందితుడి మోసాల పరిధి కేవలం తెలంగాణకే పరిమితం కాలేదని, ఇతర రాష్ట్రాలతో పాటు దుబాయ్ వంటి విదేశాల్లో ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం నిందితుడిని కస్టడీలోకి తీసుకున్నపోలీసులు, ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

### నారా లోకేశ్‌తో మిజోరం సీఎం భేటీ..

ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో మిజోరం ముఖ్యమంత్రి లాల్‌దుహోమా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లాల్‌దుహోమాను శాలువాతో సత్కరించి, ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించుకున్నారు.ఇదిలా ఉండగా, రాష్ట్రంలో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ఎన్నికలకు రికార్డు స్థాయిలో 22,800కు పైగా నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పార్టీ, ప్రతి వర్గం, నలుమూలల నుంచి అభ్యర్థులు ముందుకు రావడం ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందనడానికి నిదర్శనమని అన్నారు.ఒక్క ఓటు కూడా పడకముందే అక్రమాలు జరిగాయని ఆరోపించే వారు ఒక విషయం గుర్తుంచుకోవాలని లోకేశ్ హితవు పలికారు. "ఎన్నికల్లో గెలుపు క్షేత్రస్థాయిలో ఉంటుంది కానీ, పత్రికా సమావేశాల్లో కాదు. ప్రజలను ఎదుర్కోండి, ప్రజలే ఫలితాలను నిర్ణయిస్తారు" అని ఆయన స్పష్టం చేశారు. అక్టోబర్ 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు జరగనున్న విషయం తెలిసిందే.

### కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలు.. కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు

కొండపోచమ్మ సాగర్ నీటిని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు జారీ చేసింది. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ఈ నోటీసులు పంపించింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ సోమ భరత్ కుమార్ వీటిని జారీ చేశారు.కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ లీగల్ సెల్ పేర్కొంది. ఈ అంశంపై ఇప్పటికే 'వెలుగు' దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు నోటీసులు పంపించినట్లు తెలిపింది. అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణతో తాజాగా ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు జారీ చేసింది.తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ అంశానికి సంబంధించి చేసిన పోస్టులను వెంటనే బేషరతుగా తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని నోటీసుల్లో పేర్కొంది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేసింది.నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ లీగల్ సెల్ హెచ్చరించింది.

## టీడీపీ అభ్యర్థి ఒమ్మి అప్పలరాజు ఎన్నికల ప్రచారం :స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



విశాఖ తూర్పు, పెన్ పవర్, అక్టోబర్ 19: విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధిలోని 15వ వార్డులో కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఒమ్మి అప్పలరాజు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.వార్డు పరిధిలోని ఆరిలోవ, రాజీవ్ నగర్, అంబేద్కర్ నగర్, కనకదుర్గ నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, ప్రజల పక్షాన జీవీఎంసీ కౌన్సిల్ లో పోరాడేందుకు తనను గెలిపించాలని అభ్యర్థించారు.ఆయన సోదరుడు, రెండవ వార్డు మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు కూడా సోదరుని గెలుపు కోసం ప్రచారంలో పాల్గొన్నారు.ఈ ప్రచారంలో గాడి సత్యం, పోలరావు.రాజు, రామకృష్ణ, లక్ష్మి,షారోన్,పార్వతి, నక్కాన చంటి. రమాదేవి.తదితర పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.


# పెన్ పవర్
## ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా


# వార్డు మార్పులతో ఆశావహుల్లో ఆందోళన!



- బీఫాంల కోసం ఉత్కంఠ పోరు!
- ఒక వార్డుపై ఆశలు.. మరో వార్డులో పోటీకి సిద్ధం!
- నామినేషన్ల హడావుడి మధ్య అసలు అభ్యర్థి ఎవరన్న సందిగ్ధం!
- కూటమి, వైసీపీలో అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ
- రెబల్స్ బెంగతో పార్టీల్లో గుబులు!

**విశాఖ పశ్చిమ, పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 19 :** గ్రేటర్ విశాఖపట్నం నగర రాజకీయాల్లో వార్డు ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. టికెట్ కోసం ఆశావహుల మధ్య పోటీ ఒకవైపు.. ఆశించిన వార్డు కాకుండా మరో వార్డులో పోటీ చేయాల్సిన పరిస్థితి మరోవైపు అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తోంది. సొంత వార్డులో ఏళ్లుగా పెంచుకున్న రాజకీయ బలం, స్థానిక పరిచయాలు, ప్రజలతో ఉన్న అనుబంధాన్ని నమ్ముకున్న నాయకులకు పార్టీ అధిష్ఠానం మరో వార్డు కేటాయిస్తే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. టికెట్ దక్కినా.. సొంత గడ్డపై పోటీ చేసే అవకాశం దక్కకపోవడం కొందరు ఆశావహులకు రాజకీయ పరీక్షగా మారింది.

### ఆశించిన వార్డు ఒకటి.. కేటాయించిన వార్డు మరొకటి!

ఒక వార్డులో పోటీ చేయాలనే లక్ష్యంతో చాలాకాలంగా ప్రజల్లో తిరుగుతూ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, స్థానికంగా తమకంటూ గుర్తింపు తెచ్చుకున్న నాయకులకు పార్టీ నిర్ణయాలు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. సామాజిక సమీకరణాలు, గెలుపు అవకాశాలు, స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ అంతర్గత లెక్కల ఆధారంగా అధిష్ఠానాలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి. ఈ క్రమంలో ఆశించిన వార్డు కాకుండా మరో వార్డును కేటాయిస్తే అక్కడి ప్రజలకు కొత్తగా పరిచయం కావడం, స్థానిక నాయకుల మద్దతు కూడగట్టడం, ఓటర్ల విశ్వాసాన్ని సంపాదించడం అభ్యర్థులకు సవాలుగా మారుతోంది. సొంత వార్డులో ఉన్న పరిచయాలు, అనుచరగణం, వ్యక్తిగత సంబంధాలు కొత్త వార్డులో ఎంతవరకు ఉపయోగపడతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. అక్కడ ఇప్పటికే బలమైన స్థానిక నాయకులు ఉంటే వారితో సమన్వయం చేసుకోవడం కూడా కీలకంగా మారనుంది. పార్టీ గుర్తు, అధిష్ఠానం అండ ఉన్నప్పటికీ స్థానికంగా ప్రజల ఆదరణ పొందడం అంత సులభం కాదని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

### బీఫాం రాకముందే నామినేషన్ల సందడి!

మరోవైపు, అధికారికంగా పార్టీ బీఫాం ఎవరికి దక్కుతుందో స్పష్టత రాకముందే పలువురు ఆశావహులు నామినేషన్లు దాఖలు చేయడం, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తోంది. ఒకే వార్డులో ఒకే పార్టీ నుంచి పలువురు పోటీకి సిద్ధమవుతుండటంతో ఎవరికి టికెట్ వస్తుందన్న ఉత్కంఠ నెలకొంది. 'టికెట్ నాకే వస్తుంది' అంటూ కొందరు, 'అధిష్ఠానం తనకే హామీ ఇచ్చింది' అంటూ మరికొందరు ప్రచారం చేసుకుంటుండటంతో కార్యకర్తల్లోనూ గందరగోళం నెలకొంటోంది. సోషల్ మీడియాలో నామినేషన్ల ఫొటోలు, ర్యాలీలు, ప్రచార పోస్టులు హోరెత్తుతున్నాయి. ఒకే పార్టీకి చెందిన పలువురు నాయకులు అభ్యర్థులుగా ప్రచారం చేసుకుంటుండటంతో ఓటర్లకు అసలు అధికారిక అభ్యర్థి ఎవరో అర్థంకాని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అయితే నామినేషన్ దాఖలు చేయడం ఒక ఎత్తయితే, పార్టీ అధికారిక బీఫాం పొందడం మరో ఎత్తు కావడంతో తుది నిర్ణయం వెలువడే వరకు ఈ ఉత్కంఠ కొనసాగే అవకాశముంది.

### కూటమి, వైసీపీలో టికెట్ల లెక్కలు!

గ్రేటర్ పరిధిలోని పశ్చిమ, పెందుర్తి నియోజకవర్గాల్లో కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల నుంచి పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు అధిష్ఠానాల నిర్ణయాల కోసం ఎదురుచూస్తున్నారు. స్థానికంగా తమకున్న బలాన్ని వివరించడంతోపాటు పార్టీ నాయకుల మద్దతు పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఎవరికి టికెట్ దక్కుతుంది? ఎవరికి చివరి నిమిషంలో నిరాశ ఎదురవుతుంది? ఏ వార్డులో ఎవరిని బరిలోకి దించుతారు? అన్న అంశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కొన్ని చోట్ల సొంత వార్డులో పోటీ చేయాలని పట్టుబడుతున్న నాయకులు ఉండగా, మరికొందరు పార్టీ ఆదేశాల మేరకు కొత్త వార్డులో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇంకొందరు రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తప్పనిసరి పరిస్థితుల్లో అధిష్ఠానం నిర్ణయానికి తలొగ్గాల్సి వస్తోంది. అయితే వార్డు మార్పు వెనుక ఉన్న రాజకీయ వ్యూహం అభ్యర్థులకు ఎంతవరకు కలిసివస్తుందన్నది ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి.

### స్థానిక నాయకుల సహకారం కీలకం!

కొత్త వార్డులో పోటీ చేయాల్సి వచ్చిన అభ్యర్థులకు స్థానిక నాయకుల సహకారం అత్యంత కీలకం కానుంది. ఇప్పటికే అక్కడ పనిచేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని వెళ్లడం, అంతర్గత విభేదాలను పరిష్కరించడం, స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకోవడం ద్వారా మాత్రమే ఓటర్లకు చేరువయ్యే అవకాశం ఉంటుంది. కొత్త ప్రాంతంలో పార్టీ శ్రేణులు ఎంతవరకు సహకరిస్తాయి? పాత నాయకులు అభ్యర్థికి మద్దతుగా పనిచేస్తారా? లేక అంతర్గత అసంతృప్తితో దూరంగా ఉంటారా? అన్నది గెలుపోటములను ప్రభావితం చేసే అంశంగా మారనుంది. ప్రత్యేకించి సొంత వార్డులో బలమైన అనుచరగణం ఉన్న నాయకులు మరో ప్రాంతానికి వెళ్లినప్పుడు వారి మద్దతుదారులంతా వెంట వస్తారా? కొత్త వార్డులో ప్రత్యర్థుల వ్యూహాలను ఎలా ఎదుర్కొంటారు? స్థానిక సమస్యలపై ఎంత త్వరగా పట్టు సాధిస్తారు? అన్నది ఆసక్తికరంగా మారింది.

### బీఫాం దక్కని వారితో రెబల్స్ బెంగ!

టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించి చివరకు నిరాశకు గురైన ఆశావహులు ఏ నిర్ణయం తీసుకుంటారన్నది పార్టీలకు మరో తలనొప్పిగా మారింది. అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవిస్తూ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తారా? లేక స్వతంత్రంగా లేదా తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలో నిలుస్తారా? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. అసంతృప్త నాయకులు ప్రత్యర్థి పార్టీలకు దగ్గరవడం లేదా రెబల్‌గా పోటీ చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటే అధికారిక అభ్యర్థుల విజయావకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. అందుకే బీఫాం కేటాయింపుతోపాటు అసంతృప్తులను బుజ్జగించడం, స్థానిక నాయకుల మధ్య సమన్వయం సాధించడం, కార్యకర్తలను ఒక్కతాటిపైకి తీసుకురావడం పార్టీలకు కీలకంగా మారనుంది.

### గెలుపు బాధ్యత అధిష్ఠానానిదా.. అభ్యర్థిదా?

అభ్యర్థులను ఎంపిక చేసే సమయంలో గెలుపు అవకాశాలను ప్రామాణికంగా తీసుకుంటున్న పార్టీలు, వార్డు మార్పుల అనంతరం వారి విజయానికి ఎలాంటి సహకారం అందిస్తాయన్న చర్చ కూడా సాగుతోంది. కొత్త వార్డులో ప్రచారానికి అవసరమైన పార్టీ యంత్రాంగం, స్థానిక నాయకుల మద్దతు, కార్యకర్తల సమన్వయం కల్పించడంలో అధిష్ఠానం పాత్ర కీలకం కానుంది. అయితే పార్టీ నిర్ణయంపై ఆధారపడటంతోపాటు వ్యక్తిగత పరిచయాలు, ప్రజలతో అనుబంధం, స్థానిక సమస్యలపై అవగాహన, ప్రచార వ్యూహాలు కూడా అభ్యర్థుల విజయాన్ని నిర్ణయించనున్నాయి. మొత్తంగా గ్రేటర్ విశాఖ రాజకీయాల్లో ప్రస్తుతం టికెట్ల కేటాయింపు, వార్డుల మార్పులు, బీఫాంల పంపిణీ, అసంతృప్తుల బుజ్జగింపులు ప్రధాన చర్చాంశాలుగా మారాయి. సొంత గడ్డపై బలం నిరూపించుకోవాలనుకున్న వారికి కొత్త వార్డులు సవాల్ విసురుతుండగా, టికెట్ కోసం పోటీపడుతున్న ఆశావహులకు తుది నిర్ణయం వరకు ఉత్కంఠ తప్పడం లేదు. చివరకు పార్టీ అధికారిక అభ్యర్థులుగా ఎవరు నిలుస్తారు? అసంతృప్తులు సర్దుకుంటారా? రెబల్స్ బరిలోకి దిగుతారా? వార్డు మార్పులు గెలుపు సమీకరణాలను మారుస్తాయా? అన్న ప్రశ్నలకు రానున్న పరిణామాలే సమాధానం చెప్పనున్నాయి.

## శ్రీ మంగళ కాళీ పీఠంలో వైభవంగా నవరాత్రి విశేష పూజలు

**శ్రీ భువనేశ్వరీ దేవికి విశేష అర్చనలు, హోమాలు -- లోకక్షేమం, దేశ సుఖశాంతుల కోసం ప్రత్యేక యజ్ఞం**



**విశాఖ, పెన్ పవర్, అక్టోబర్ 19** :నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీ మంగళ కాళీ పీఠంలో అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీ భువనేశ్వరీ దేవి అమ్మవారికి విశేష అర్చనలు, పూజలు, హోమా ది క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు.శ్రీ పరమే శ్వర నందగిరి స్వామీజీ వారి ఆధ్వర్యంలో, శ్రీ పరమ గురుదేవులు మావతార్ బాబాజీ వారి దివ్య ఆశీస్సు లతో ఈ పవిత్ర హోమ కార్యక్రమం జరిగింది. సకల లోక కళ్యాణం, ప్రజల శ్రేయస్సు, దేశంలో సుఖశాంతు లు, సౌభాగ్యాలు, ధర్మ పరిరక్షణ, సర్వజనుల ఆయు రారోగ్య ఐశ్వర్యాల వృద్ధిని ఆకాంక్షిస్తూ వేదమంత్రో చ్చారణల నడుమ హోమాన్ని నిర్వహించారు. యజ్ఞా గ్నికి సమర్పించిన పవిత్ర ఆహుతులు విశ్వశాంతికి, లోకక్షేమానికి ప్రతీకగా నిలిచాయి. జగజ్జనని శ్రీ భువ నేశ్వరీ దేవి అమ్మవారి కృపాకటాక్షాలు సమస్త మాన వాళిపై ప్రసరించాలని, ప్రజల జీవితాల్లో సుఖసంతో షాలు, శాంతిసౌభాగ్యాలు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు.నవరాత్రుల పర్వదినాల్లో అమ్మవారి ఆరాధన ద్వారా ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొంది స్తూ, ధర్మం, భక్తి, సేవాభావాలను సమాజంలో విస్త రింపజేయడమే ఈ పూజా కార్యక్రమాల ప్రధాన సంక ల్పమని నిర్వాహకులు తెలిపారు.జగజ్జనని శ్రీ భువనేశ్వరీ దేవి అమ్మవారి అనుగ్ర హంతో సకల జనులు సుఖశాంతులతో, ఆయురారోగ్య ఐశ్వర్యా లతో వర్ధిల్లాలని శ్రీ మంగళ కాళీ పీఠం తరఫున ప్రార్థించారు.

## శరన్నవరాత్రి అన్నసమారాధన.. ముఖ్య అతిథిగా గంటా రవితేజ



**అన్నసమారాధనకు రూ.1.12 లక్షల ఆర్థిక సాయం అందించిన కోరాడ నాగభూషణం చారిటబుల్ ట్రస్ట్**

**ఆనందపురం, పెన్ పవర్ అక్టోబర్ 19:** ఆనందపురం మండలం వేములవలస పరిధిలోని సత్యకళ్యాణి అపార్ట్‌మెంట్స్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమిలి తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు గంటా రవితేజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా గంటా రవితేజ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ అన్నసమారాధన కార్యక్రమానికి అవసరమైన మొత్తం ఆర్థిక సాయాన్ని కోరాడ నాగభూషణం చారిటబుల్ ట్రస్ట్ అందించింది. ట్రస్ట్ చైర్మన్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ ఉత్సవ కమిటీకి రూ.1,12,000 ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా గంటా రవితేజ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను అందించడంతోపాటు భక్తిభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఇటువంటి ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించి, సమాజంలో సోదరభావాన్ని చాటుతాయని అన్నారు.కార్యక్రమంలో వేములవలస మాజీ ఉపసర్పంచి కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిషత్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లు సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో స్వీకరణ
- జెడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్లు జిల్లా పరిషత్ సీఈఓ కార్యాలయంలో స్వీకరణ
- అక్టోబర్ 27న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం
- నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

**పాడేరు పెన్ పవర్: అక్టోబర్ 19:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీమతి టి. నిషాంతి తెలిపారు.ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల తేదీలు, నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలపై అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలకు అవగాహన కల్పించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

### నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు

ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్లను సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయాల్లో సమర్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ, జెడ్పీ) కార్యాలయంలో స్వీకరిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఎన్నికల నిబంధనల ప్రకారం పూర్తిగా నింపి, అవసరమైన పత్రాలను జతచేసి, నిర్ణీత గడువులోగా సమర్పించాలి. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు జారీ చేసే సూచనలు, నోటీసులు, అధికారిక మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ఎన్నికల షెడ్యూల్ వివరాలుతేదీఎన్నికల కార్యక్రమం అక్టోబర్ 19, 2026 రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్ అక్టోబర్ 21, 2026 నామినేషన్ల స్వీకరణ ప్రారంభంఅక్టోబర్ 23, 2026 నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ అక్టోబర్ 24, 2026 నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 25, 2026 తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్ల దాఖలుఅక్టోబర్ 26, 2026 అప్పీళ్ల పరిష్కారం అక్టోబర్ 27, 2026 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ అక్టోబర్ 27, 2026 మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన నవంబర్ 3, 2026 పోలింగ్ --- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నవంబర్ 4, 2026 అవసరమైన చోట రీపోలింగ్ నవంబర్ 5, 2026 ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాల ప్రకటన ఎన్నికల నిర్వహణకు సంబంధించిన గణాంకాలు జిల్లాలో మొత్తం 11 జెడ్పీటీసీ స్థానాలు, 172 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలునిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 616 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం ఓటర్ల సంఖ్య 4,98,467గా ఉందని వివరించారు.

ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, సిబ్బంది కేటాయింపు, ఎన్నికల సామగ్రి, ఇతర అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.

ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఓటర్లకు విస్తృత అవగాహన కల్పించాలి

ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరించేందుకు గ్రామాలు, మండలాల స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిషాంతి తెలిపారు. ఎన్నికల తేదీలు, పోలింగ్ కేంద్రాల వివరాలు, నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అంశాలపై ప్రజలకు అధికారిక సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన వార్తలు, ప్రకటనలు, అభ్యర్థుల వివరాలను ప్రచురించే ముందు సంబంధిత ఎన్నికల అధికారుల నుంచి సమాచారాన్ని ధ్రువీకరించుకోవాలని మీడియా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో నిర్ధారించని సమాచారం ప్రచారం కాకుండాబాధ్యతాయు తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల స్వీకరణ



సమయాలు, అప్పీళ్ల ప్రక్రియ, నామినేషన్ల ఉపసంహరణ, ఇతర నిబంధనలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారిక నోటిఫికేషన్, సంబంధిత ఎన్నికల అధికారుల ఉత్తర్వులను అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా అనుసరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీమతి టి. నిషాంతి తెలిపారు.

# 29 సార్లు రక్తదానం... ఎందరికో స్ఫూర్తి ప్రదాత



**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 19:**ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడేందుకు ముందుకు రావడం ఎంతో గొప్ప సేవ. అలాంటి సేవాభావాన్ని ఆచరణలో చూపిస్తూ హుకుంపేట మండలానికి చెందిన ఆకుపాటి గోపికృష్ణ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అల్లూరి జిల్లా పాడేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ మహిళకు రక్తం అవసరమైందని, రక్తం అందుబాటులో లేక ఆమె ప్రాణాపాయ స్థితిలో ఉందని సోషల్ మీడియాలో సమాచారం వైరల్ కావడంతో గోపికృష్ణ వెంటనే స్పందించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి చేరుకొని రక్తదానం చేశారు. ఇప్పటివరకు ఆయన 29 సార్లు రక్తదానం చేయడం విశేషం. అత్యవసర సమయంలో రక్తం అవసరమైన వారికి తన వంతు సహాయం అందించేందుకు ఎప్పుడూ ముందుండే గోపికృష్ణ సేవలను పలువురు అభినందిస్తున్నారు. రక్తం అవసరమని సమాచారం అందినప్పుడు సాధ్యమైనంత త్వరగా స్పందించి రక్తదానం చేయడం ద్వారా ఎంతోమంది కుటుంబాల్లో ఆశలు నింపవచ్చని ఆయన సేవ చాటిచెబుతోంది. తల్లిదండ్రులు జన్మనిస్తే, ప్రాణాపాయ సమయంలో రక్తదానం చేసిన వ్యక్తి మరొకరికి పునర్జన్మ ప్రసాదించినట్లేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదాల్లో గాయపడినవారు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావంతో ఇబ్బందులు ఎదుర్కొనే మహిళలు, ఇతర వైద్య సమస్యలతో బాధపడేవారికి సకాలంలో రక్తం అందడం ఎంతో కీలకం. అలాంటి పరిస్థితుల్లో రక్తదాతలు ముందుకు రావడం వల్ల బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు ఎంతో ఊరట లభిస్తుంది. రక్తదానం చేయాలనుకునే వారు తమ ఆరోగ్య పరిస్థితిని వైద్య సిబ్బందికి తెలియజేసి, రక్తదానానికి తగిన అర్హతలు కలిగి ఉన్నారో లేదో నిర్ధారించుకోవాలి. అలాగే గతంలో రక్తదానం చేసిన తేదీని గుర్తుంచుకొని, తదుపరి రక్తదానానికి అవసరమైన వ్యవధి పూర్తయిన తర్వాతే వైద్యుల సూచనల మేరకు రక్తదానం చేయాలి. సోషల్ మీడియాలో రక్తం అవసరమనే సమాచారం కనిపించినప్పుడు వీలైనవారు ముందుకు వచ్చి ఆకుపాటి గోపికృష్ణ మాదిరిగా యువతలో సేవాభావం పెంపొందితే అత్యవసర సమయాల్లో రక్తం కోసం ఎదురుచూసే పరిస్థితులను కొంతవరకు తగ్గించవచ్చని పలువురు పేర్కొంటున్నారు. 29 సార్లు రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్న గోపికృష్ణను ఆదర్శంగా తీసుకొని యువతతో పాటు రక్తదానం చేయగలిగిన ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పలువురు కోరారు.

## అలంకారప్రాయంగా మారిన సెల్ టవర్.

- సిగ్నల్ లేక ప్రభుత్వ సేవలకు దూరం
- కొడితల గ్రామంలో నిరుపయోగంగా సెల్ టవర్



**హుకుంపేట పెన్ పవర్ అక్టోబర్ 19 :** అల్లూరి సీతారామరాజుజిల్లా అరకు నియోజకవర్గం. హుకుంపేట మండలం మండలంలోని పట్టాం పంచాయతీ కొడితల గ్రామంలో సెల్‌ఫోన్ సిగ్నల్ సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 200 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌కు ఫోన్ చేయడానికి కూడా సిగ్నల్ అందడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు గ్రామంలో 2024లో సెల్ టవర్ ఏర్పాటు చేసినప్పటికీ రెండేళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో సిగ్నల్ సౌకర్యం అందుబాటులోకి రాలేదని తెలిపారు. ఇటీవల తుఫాన్ గాలులకు టవర్‌కు సంబంధించిన పరికరాలు దెబ్బతిన్నప్పటికీ బీఎస్ఎన్ఎల్ అధికారులు మరమ్మతులు చేపట్టలేదని ఆరోపించారు. దీంతో ప్రభుత్వ సేవలు, అత్యవసర సమాచారం, ఇతర సాంకేతిక సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి సెల్ టవర్‌కు మరమ్మతులు చేపట్టి నిరంతర సిగ్నల్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు సతీష్, శ్రీను, ప్రసాద్, కామేశ్వరరావు, చిన్నయ్య, బాబురావు, చిట్టిబాబు, అచ్యుతరావు, భాస్కరరావు, లక్ష్మణ్, సత్యారావు, కొండలరావు, కృష్ణ తదితరులు కోరారు.

**సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోతే.**

ఆందోళనకు దిగుతాం: కొర్రా ఆనంద్ ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కొడితల గ్రామ ప్రజలకు సెల్‌ఫోన్ సిగ్నల్ సౌకర్యం కల్పించి, ప్రభుత్వ సేవలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సీపీఎం పార్టీ మాజీ మండల నాయకులు కొర్రా ఆనంద్ డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించని పక్షంలో గ్రామ ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన మీడియా ద్వారా హెచ్చరించారు.

## వనభంగి గ్రామ ఆంజనేయ స్వామిగుడి కి మహర్ద




**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 19:**పెదబయలు మండలం మారుమూల వనభంగి గ్రామం లో కొలువు దీరిన అభయ హస్త ఆంజనేయ స్వామి గుడినీ ఎవ్వరు పట్టించుకోకపోవడం వల్ల గత కొన్నేళ్ళ పూర్తి కాకుండా నిరుపయోకరంగ ఉండి పోయింది. ఆ గ్రామానికి సందర్శించిన కొంతమంది దాతలు చలించి ముందుకు వచ్చి గుడిని మరమ్మతులు చేయడం ప్రారంభించారు. అందులో భాగంగానే ప్రభుత్వ "పాలిటెక్నిక్ ల్యాబ్ టెక్నీషియల్ సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న "పి. భవాని కూడా ముందు కు వచ్చి గుడి మరమ్మతులు కోసం రూ 10000 వేల ఆర్థిక సహాయ విరాళాన్ని గ్రామానికిచెందిన పెద్దలకు అందజేశారు. దీంతో అభయ ఆంజనేయ స్వామి ఆలయం రంగు పులుము కొంది అధిక మొత్తంలో అందజేసిన ఆమె సహాయని గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# పరిషత్ ఎన్నికలకు సర్వం సిద్ధం



- అక్టోబర్ 21 నుంచి నామినేషన్ల స్వీకరణ.. నవంబర్ 3న పోలింగ్
- జిల్లాలో 4 జెడ్పీటీసీ, 53 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు
- 1,462 మంది సిబ్బంది నియామకం.. 203 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 19 :** విశాఖపట్నం జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21 నుంచి నామినే షన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుందని వెల్లడించారు. జిల్లాలో నాలుగు జెడ్పీటీసీ, 53 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్న ట్లు పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకం గా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించా రు. అక్టోబర్ 23 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కాగా, 24న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నట్లు తెలిపారు. నవంబర్ 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటాయని పేర్కొన్నారు. నవంబర్ 7న పరోక్ష ఎన్నికల నోటీసు జారీ చేసి, 11న పరోక్ష ఎన్నికల ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరిషత్ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా జా యింట్ కలెక్టర్, అదనపు ఎన్నికల అథారిటీగా జెడ్పీ సీఈవో వ్యవహరిస్తారని తెలిపారు.

**పటిష్టంగా ఎన్నికల ఏర్పాట్లు**

ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో 16 జోన్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సుమారు 106 ప్రాంతాల్లో 203 పోలింగ్ కేంద్రాలను ఏర్పా టు చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పా రు. ఎన్నికల విధుల నిర్వహణకు 1,462 మంది సిబ్బందిని నియమించామని, పోలింగ్ సామగ్రి తరలింపునకు 25 రూట్లను గుర్తించామని వివరించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పర్యవేక్షించేందుకు నాలుగు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లు, నాలుగు స్టాటిక్ సర్వైలెన్స్ బృందా లు, రెండు వీడియో వీక్షణ బృందాలను ఏర్పా టు చేసినట్లు తెలిపారు. ఎన్నికల వ్యయ పర్య వేక్షణకు ఐదు బృందాలు, సింగిల్ విండో క్లియ రెన్స్ కోసం మరో ఐదు బృందాలను నియమిం చినట్లు పేర్కొన్నారు.ఎంపీటీసీ అభ్యర్థులకు ఎన్నికల వ్యయ పరిమితిని రూ.4 లక్షలుగా, జెడ్పీటీసీ అభ్యర్థులకు రూ.8 లక్షలుగా నిర్ణయిం చినట్లు కలెక్టర్ వెల్లడించారు. అభ్యర్థులు ఎన్ని కల సంఘం నిర్దేశించిన నిబంధనలను తప్పని సరిగా పాటించాలని సూచించారు.

**ఆర్వో కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ**

జెడ్పీటీసీ అభ్యర్థులు విశాఖపట్నం జిల్లా పరి షత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి ఆర్వో ఛాంబర్‌లో నామినేషన్లు సమ ర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎంపీటీసీ అభ్యర్థులు సంబంధిత మండల పరిషత్ కార్యా లయాల్లోని ఆర్వో ఛాంబర్లలో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఇప్పటికే రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు పే ర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారద ర్శకంగా సాగేందుకు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# వీఐఐటీలో ఘనంగా దసరా వేడుకలు -- నవోత్సవ్ 2026



**కూర్మన్నపాలెం: అక్టోబర్19** విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అటానమస్ విద్యార్థి కార్యకలాపాల మండలి , సీఎస్ఈ--ఏఐ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో దసరా సాంస్కృతిక వేడుకలు --నవోత్సవ్ 2026ను ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను విద్యార్థుల్లో పెంపొందించడంతో పాటు ఐక్యతా భావాన్ని చాటిచెప్పే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమం స్వాగత ప్రసంగంతో ప్రారంభమై, అనంతరం జాతీయ గీతం వందేమాతరం ఆలపించారు. ఈ సందర్భంగా విద్యార్థి సమన్వయకర్త దసరా పండుగ తొమ్మిది రోజుల విశిష్టతను వివరించడంతో పాటు రావణ సంహారం కథను వివరించి, చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా ప్రతీకగా నిలుస్తుందని తెలియజేశారు.విజ్ఞాన్ విద్యాసంస్థల సమూహం ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య సభను ఉద్దేశించ ప్రసంగిస్తూ దసరా పండుగ ప్రాముఖ్యతను, దాని వెనుక ఉన్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలను వివరించారు. సత్యం, ధర్మం, నైతిక విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. సుధాకర్, రెక్టార్ డాక్టర్ వి. మధుసూధన రావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు.వేడుకల్లో భాగంగా పది విద్యార్థి బృందాలు ప్రదర్శించిన సంప్రదాయ, పండుగ నేపథ్య నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు తమ కళాత్మక ప్రతిభను, సృజనాత్మకతను ప్రదర్శిస్తూ భారతీయ సంస్కృతిలోని వైవిధ్యాన్ని ప్రతిబింబించారు.అనంతరం నిర్వహించిన రావణ దహనం కార్యక్రమం చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచింది. సత్యం, ధర్మం, నీతి మార్గాల్లో నడవాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. చివరగా ప్రముఖులు, నృత్య ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులు, ఎస్ఏసీ సభ్యులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.ఈ కార్యక్రమంలో కళాశాల డీన్లు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, యాజమాన్య ప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ వేడుకలను డీన్ -- స్టూడెంట్ అఫైర్స్ శ్రీ చి. శివరామ కృష్ణ, అసోసియేట్ డీన్ -- స్టూడెంట్ యాక్టివిటీస్, ఈఈఈ విభాగం కె. శ్రావంతి, సీఎస్ఈ--ఏఐ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ వి. సుధా మోనికా సమన్వయం చేశారు. ఎస్ఏసీ, సీఎస్ఈ--ఏఐ విభాగాల సహకారంతో వేడుకలు విజయవంతంగా నిర్వహించారు .

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలి

- జీకేవీధిలో ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన ఏఎస్పీ నిరంజన్ మహేంద్ర సిన్హా



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 19:**స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు సమన్వయంతో సహకరించాలని చింతపల్లి ఏఎస్పీ నిరంజన్ మహేంద్ర సిన్హా కోరారు.సోమవారం గూడెంకొత్తవీధి మండలంలో ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను పరిశీలిస్తూ, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరస్పర సహకారంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గూడెంకొత్తవీధి ఎస్సై కె. సురేష్, ఎంపీడీవో బి.హెచ్.వి. రమణబాబు పాల్గొన్నారు.

## ఎన్నికల ఏర్పాట్లు, నామినేషన్ల పరిశీలనలో అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల పరిశీలకుడు ఎ. భార్గవ్ తేజ్, ఐఏఎస్, వ్యయ పరిశీలకుడు పి.వి. సందీప్ రెడ్డి, ఐఎఫ్ఎస్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 19:** జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికల నిర్వహణ లో భాగంగా ఎన్నికల ఏర్పాట్లు, నామినేషన్ల పరిశీలనను నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని ఎన్నికల పరిశీలకుడు ఎ. భార్గవ్ తేజ్, ఎన్నికల వ్యయ పరిశీలకుడు పి.వి. సందీ ప్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలనను, సౌత్ జోన్ కార్యాలయంలో ఎన్నికల విభాగాలు, స్ట్రాంగ్ రూములు, ఎన్నికల సామగ్రి ఏర్పాట్లను వారు తనిఖీ చేశారు. అనంతరం సౌత్ జోన్ జోనల్ కమిషనర్, సహాయ ఎన్నికల అధికారి ఎం. మల్లయ్య నాయుడుతో కలిసి 39వ వార్డులోని రమాదేవి భానోజీ రావు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించా రు.పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎన్నికల ప్రక్రియను పారదర్శకం గా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాల ని అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వ హణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముం దస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# తుంగలం గ్రామస్తులు తో పోలీస్ లు సమావేశం



**గాజువాక:పెన్ పవర్ ,అక్టోబర్19** పోలీస్ స్టేషన్ పరిధిలోని కాపు తుంగలాం గ్రామంలో గాజువాక సీఐ వాసు నాయుడు ఎన్నికల నేపథ్యంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఎవరైనా గొడవలకు దిగినా, బెదిరింపులకు పాల్పడినా, ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా గ్రామస్థులందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఐ వాసు నాయుడు కోరారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్ అక్టోబరు 19:** రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్, పరిషత్ ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావ రణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్య లు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. సోమవారం కార్యదర్శి మల్లికా ర్జున, ఐజీ రాజకుమారితో కలిసి ఆయన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ కు అవసరమైన పోలీసు బందోబస్తును పటిష్టం గా ఏర్పాటు చేయాలని, ఎన్నికల ప్రక్రియ సజా వుగా, ప్రశాంతంగా సాగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాల్లో నియమించిన సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు, పోలీసు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిస్థితు లను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల నిర్వహణ లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడా లని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, పరిశీలకులు ఏ. భార్గవ్ తేజ్, వ్యయ పరిశీలకు లు పి.వి. సందీప్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ విద్యా ధరి, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, జిల్లా పరిష త్ సీఈవో నారాయణమూర్తి, డీపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అండతో వివాదాస్పద భూమిలో సరుగుడు తోట నరికివేత



**నర్సీపట్నం, పెన్ పవర్ (అక్టోబర్ 19) :**కోర్టు వివాదంలో ఉన్న భూమిలో సరుగుడు తోటను పోలీసులను అడ్డం పెట్టుకుని పాలపర్తి పద్మావతి దౌర్జన్యంగా తరలించారంటూ మాకవరపాలెం మండలం హరప్పా అగ్రహారానికి చెందిన పాలపర్తి గోవిందరావు ఆరోపించారు. మాకవరపాలెం మండలం హరప్పా అగ్రహారానికి చెందిన సర్వేనెంబర్ 2-13ఎ, 4-2ఎ లో 80 ఎకరాల భూమిపై పర్మినెంట్ ఇంజక్షన్ ఉందని తెలిపారు. గత కొంతకాలంగా రెండు కుటుంబాలకు ఈ భూమిపై వివాదం నడుస్తుందని, అయినప్పటికీ పద్మావతి భర్త పోలీస్ డిపార్ట్మెంట్ కు చెందిన వ్యక్తి కావడంతో ఈ దౌర్జన్యానికి పాల్పడ్డారని అన్నారు. ఈ భూమిలో సరుగుడు తోట నరికి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు భూమి వద్దకు చేరుకున్నానని, అక్కడ పోలీసులు కాపలాగా ఉండి సరుగుడు తోటను నరికి తరలిస్తున్నారని అన్నారు. పోలీసులను అడుగుగా మేమే తరలిస్తున్నామని చెప్పారన్నారు. అదే విషయం తనకు లిఖితపూర్వకంగా కావాలని అడుగుగా నిరాకరించారన్నారు. ఎస్సై దామోదర్ ఫోన్ చేసి అక్కడ పనిని అడ్డగించవద్దని, ఆ సరుగుడు లోడు మేమే తరలిస్తున్నామని చెప్పారని అన్నారు. దీంతో దిక్కు తోచని స్థితిలో మీడియాను ఆశ్రయించానన్నారు. గతంలో కూడా ఇలాగే రాత్రివేళ కొన్ని చెట్లు నరికి తీసుకుపోతుంటే సమాచారం తెలుసుకొని అడ్డగించి వాటిని పోలీసులకు అప్పగించమన్నారు. అవి ఇప్పటికీ పోలీసుల ఆధీనంలోనే ఉన్నాయని తెలిపారు. తాను ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోలేదని, ఇలా దౌర్జన్యంగా పట్టుకు పోవడానికి మాత్రం సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ఎస్సై దామోదర్ వివరణ కోరగా లోడ్ తో సహా వాహనాన్ని సీజ్ చేస్తామని, కోర్టు తీర్పు తర్వాత హక్కుదారులకు అందిస్తామని అన్నారు. పద్మావతి మీడియాతో మాట్లాడుతూ ఇది తనకు మామగారి ద్వారా సంక్రమించిందని, 2008 నుంచి భూమి సాగులో ఉన్నానని తెలిపారు. ఇందులో ఎవరికీ ఎలాంటి సంబంధం లేదని, ఒకవేళ నాకు సంబంధం లేదని నిరూపిస్తే తోట ఖరీదు చెల్లిస్తానని ఖరాకండిగా తెలిపారు.

# అడవిబాటలో అక్షరాలు.. డోలీ మోతలో ప్రాణాలు.

- రహదారి ఏదీ..? గోగులబంధ గిరిజనుల గోడు వినేదెవరు.
- ఐదు కిలోమీటర్ల రహదారి కోసం మూడు దశాబ్దాలుగా ఎదురుచూపులు.
- 'అడవితల్లి బాట'తోనైనా మారేనా గ్రామస్థుల తలరాత?
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవ చూపాలని వేడుకోలు.




**చింతపల్లి, పెన్ పవర్ అక్టోబరు 19.** ఒకవైపు బడికి వెళ్లాలంటే ఐదు కిలోమీటర్ల అడవిబాట.. మరోవైపు అనారోగ్యమొస్తే డోలీ మోతే దిక్కు! కనీసం ద్విచక్ర వాహనం కూడా గ్రామానికి చేరుకోలేని దుస్థితి. ఇదీ చింతపల్లి మండలం లంబసింగి పంచాయతీ పరిధిలోని గోగులబంధ గిరిజనుల పరిస్థితి. గ్రామం ఏర్పడి సుమారు 30 ఏళ్లు గడుస్తున్నా రహదారి, పాఠశాల, సురక్షిత తాగునీరు వంటి కనీస సదుపాయాలు అందుబాటులోకి రాలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతిబంధ నుంచి ఐదు కిలోమీటర్ల మేర పక్కా రహదారి నిర్మిస్తే తమ కష్టాలు తీరుతాయని ఆశిస్తున్నారు. గోగులబంధలో సుమారు 25 కుటుంబాలకు చెందిన వంద మందికిపైగా గిరిజనులు నివసిస్తున్నారు. పంచాయతీ కేంద్రం లంబసింగికి 12 కిలోమీటర్లు, చింతపల్లి మండల కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. రేషన్ సరుకుల కోసం ఐదు కిలోమీటర్ల మేర అడవిబాటలో రావిమానుపాకలు చేరుకోవాల్సి వస్తోంది. ఇతర అవసరాల కోసం బయటకు వెళ్లాలన్నా ముందుగా నడుచుకుంటూ నూతిబంధకు చేరుకుని అక్కడి నుంచి ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించాలి. రహదారి లేకపోవడంతో గ్రామానికి ద్విచక్ర వాహనాన్ని కూడా తీసుకురాలేకపోతున్నామని యువకులు వాపోతున్నారు. అంతేకాకుండా గ్రామంలో ఎవరైనా అనారోగ్యానికి గురైనా, గర్భిణులను ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి వచ్చినా కుటుంబ సభ్యులకు కష్టాలు తప్పడం లేదు. రహదారి సౌకర్యం లేకపోవడంతో రోగులను డోలీల్లో మోసుకుంటూ సుమారు రెండు కిలోమీటర్ల కొండదారిలో ప్రయాణించి, కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ పరిధిలోని బచ్చింత గ్రామానికి తీసుకెళ్లాలి. అక్కడి నుంచి ఆటోలో డౌనూరు ఆసుపత్రికి చేరుకోవాల్సి వస్తోంది. వర్షాకాలంలో మార్గం మరింత కష్టతరంగా మారుతోందని, అత్యవసర సమయాల్లో సకాలంలో వైద్యం అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామంలో 20 మందికిపైగా బడి ఈడు పిల్లలు ఉన్నప్పటికీ సొంతంగా బడి లేదు. ఐదు కిలోమీటర్ల దూరంలోని నూతిబంధకు అటవీ మార్గంలో నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. దీంతో కొందరు తల్లిదండ్రులు రెండు కిలోమీటర్ల దూరంలోని కొయ్యూరు మండలం ముల్లిమెట్టలో ఉన్న జీటీడబ్ల్యూ పాఠశాలకు పిల్లలను పంపిస్తున్నారు. అటవీ ప్రాంతం గుండా రాకపోకలు సాగించాల్సి రావడంతో పిల్లలు క్షేమంగా ఇంటికి చేరుకునే వరకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రహదారి సౌకర్యం లేకపోవడం విద్యార్థుల చదువుకు సైతం ఆటంకంగా మారిందని వారు చెబుతున్నారు. గ్రామ సమస్యలను పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పరిష్కారం లభించలేదని గ్రామస్తులు జర్సింగి మత్స్యరాజు, కృష్ణారావు, మర్రిచెట్టు మన్మథరావు, చిన్నయ్య, వెచ్చంగి మోహనరావు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో చేపట్టిన 'అడవితల్లి బాట' కార్యక్రమం తమ గ్రామానికి కూడా రహదారి సౌకర్యాన్ని తీసుకొస్తుందని ఆశిస్తున్నారు. నూతిబంధ నుంచి గోగులబంధ వరకు ఐదు కిలోమీటర్ల మేర పక్కా రహదారిని నిర్మించాలని గ్రామస్థులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. రహదారి ఏర్పాటైతే విద్యార్థుల రాకపోకలతోపాటు అత్యవసర సమయాల్లో రోగులను ఆసుపత్రులకు తరలించడం సులభమవుతుందని పేర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారితోపాటు తాగునీరు, పాఠశాల వంటి కనీస సదుపాయాలు కల్పించాలని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని గోగులబంధ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రజాసేవే పరమావధి.. ప్రజల మనిషిగా దవల గోపాల్!

- జనసేన అభ్యర్థిగా బరిలోకి.. ప్రజా సమస్యలపై స్పందన
- సేవా దృక్పథంపై స్థానిక ప్రజల చర్చ
- వార్డు అభివృద్ధికి ప్రజలకు అందుబాటు
- ఎన్నికల వేళ ప్రాధాన్యం సంతరించుకున్న అంశాలు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 19 :** ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యలను తెలుసుకుంటూ, అవసరమైన సమయంలో తనవంతు సహకారం అందించాలనే తపనతో ముందుకు సాగుతున్న నాయకుడిగా దవల గోపాల్ పేరు స్థానికంగా చర్చకు వస్తోంది. ప్రజాసేవను ప్రధాన లక్ష్యంగా భావిస్తూ జనసేన పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఆయనకు పార్టీ తరఫున వార్డు అభ్యర్థిగా అవకాశం లభించడంతో ఆయన రాజకీయ ప్రస్థానంపై ఆసక్తి నెలకొంది. రాజకీయాల్లో ప్రజలతో అనుబంధం, స్థానిక సమస్యలపై అవగాహన, ప్రజలకు అందుబాటులో ఉండే స్వభావం కీలకమైన అంశాలుగా పరిగణించబడుతున్నాయి. ఈ నేపథ్యంలో దవల గోపాల్ ప్రజలతో కొనసాగిస్తున్న సంబంధాలు, సేవా కార్యక్రమాల్లో ఆయన పాత్ర, వార్డు స్థాయిలో ప్రజల అవసరాలపై స్పందించే తీరు చర్చనీయాంశాలుగా మారుతున్నాయి. ప్రజాప్రతినిధిగా ముందుకు రావాలనుకునే వ్యక్తికి ప్రజల సమస్యల పట్ల అవగాహన ఉండటంతో పాటు, వాటి పరిష్కారానికి చొరవ చూపే మనస్తత్వం అవసరం. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం, తమ సమస్యలను చెప్పుకునేందుకు వచ్చినవారిని ఆదరించడం, అవసరమైన సహకారం అందించేందుకు ప్రయత్నించడం వంటి లక్షణాలు ప్రజలతో సత్సంబంధాలను ఏర్పరచడంలో దోహదపడతాయి. దవల గోపాల్ విషయంలోనూ ప్రజలకు అందుబాటులో ఉండటం, అవసరమైన సమయంలో సహాయం చేసేందుకు ముందుకు రావడం వంటి అంశాలను ఆయన అనుచరులు ప్రస్తావిస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా స్పందించడం, వార్డు పరిధిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానిక రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



జనసేన పార్టీతో కలిసి పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తున్న దవల గోపాల్‌కు వార్డు అభ్యర్థిగా అవకాశం లభించడం ఆయన మద్దతుదారుల్లో ఆసక్తిని పెంచింది. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలపై స్పందన, స్థానికంగా ప్రజలతో ఏర్పడిన సంబంధాలు ఎన్నికల సమయంలో ప్రాధాన్యం పొందే అంశాలుగా నిలుస్తున్నాయి. అయితే, పార్టీ అభ్యర్థిగా అవకాశం లభించడం ఒక బాధ్యతకు నాంది మాత్రమే. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, వార్డు అభివృద్ధికి సంబంధించిన అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండటం, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించడం అభ్యర్థికి ముఖ్యమైన బాధ్యతలు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొనే సమస్యలు వారి రోజువారీ జీవితాలపై ప్రభావం చూపుతుంటాయి. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారుల నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, ప్రజలకు అందుబాటులో ఉండే మౌలిక సదుపాయాలు వంటి అంశాలు వార్డు అభివృద్ధిలో కీలకమైనవి. ఈ సమస్యలను గుర్తించడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, పరిష్కారానికి అనుసరించాల్సిన విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి చర్యలు ప్రజాప్రతినిధుల బాధ్యతల్లో భాగంగా ఉంటాయి. దవల గోపాల్ కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా ఈ అంశాలపై దృష్టి సారిస్తే వార్డు అభివృద్ధికి తనవంతు సహకారం అందించే అవకాశం ఉంటుంది. వార్డుల వారీగా అభ్యర్థుల ఎంపిక, రాజకీయ పార్టీల నిర్ణయాలు, స్థానిక నాయకుల పాత్ర వంటి అంశాలు ఎన్నికల సమయంలో సహజంగానే చర్చకు వస్తుంటాయి. ఈ క్రమంలో దవల గోపాల్‌కు జనసేన పార్టీ తరఫున అభ్యర్థిగా అవకాశం లభించడం ఆయన మద్దతుదారుల్లో ఉత్సాహాన్ని కలిగించిన అంశంగా కనిపిస్తోంది. అయితే, ఎన్నికల ఫలితాలను ముందుగానే అంచనా వేయడం కంటే అభ్యర్థి ప్రజల ముందుంచే అంశాలు, స్థానిక సమస్యలపై ఆయన అవగాహన, ఎన్నికల ప్రచారంలో అనుసరించే విధానం, ఓటర్ల స్వతంత్ర నిర్ణయం వంటి అంశాల ఆధారంగా రాజకీయ పరిస్థితులను పరిశీలించడం సముచితం. ఎన్నికల సమయంలో అభ్యర్థులు తమ ఆలోచనలు, అభివృద్ధి ప్రాధాన్యాలు, ప్రజా సమస్యలపై తమ దృక్పథాన్ని ప్రజల ముందుంచడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం. అదే సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని గౌరవించడం, ప్రత్యర్థులపై నిరాధార ఆరోపణలు చేయకుండా ఉండటం, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు దూరంగా ఉండటం కూడా అంతే ముఖ్యం. ఈ నేపథ్యంలో దవల గోపాల్ తన ప్రజాసేవా దృక్పథాన్ని, వార్డు అభివృద్ధిపై తన ఆలోచనలను ప్రజల ముందుంచుతూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం, సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన మార్గాల్లో కృషి చేయడం, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రచారం నిర్వహించడం ఆయన రాజకీయ ప్రయాణంలో ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. ముగింపుగా.. జనసేన పార్టీ తరఫున దవల గోపాల్ అభ్యర్థిత్వం స్థానిక రాజకీయాల్లో ఆసక్తిని పెంచింది. ప్రజలతో అనుబంధం, సేవా దృక్పథం, వార్డు అభివృద్ధిపై అవగాహన వంటి అంశాలు ఎన్నికల వేళ చర్చకు వస్తున్నాయి. ప్రజల అవసరాలకు స్పందిస్తూ, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ ఆయన ముందుకు సాగే తీరు రానున్న రోజుల్లో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకోనుంది.

## అమ్మవారి దారకొండలో ఈసారి ఏకగ్రీవానికి బ్రేక్!

- సీపీఎం కంచుకోటలో మారుతున్న రాజకీయ సమీకరణాలు..
- బరిలోకి దిగేందుకు టీడీపీ, వైసీపీ సన్నాహాలు?



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 19:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం అమ్మవారి దారకొండ పంచాయతీలో ఈసారి సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం కావడం అనుమానంగా కనిపిస్తోంది. గత రెండు పర్యాయాలు ఏకగ్రీవ ఎన్నికలతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ పంచాయతీలో ప్రస్తుతం మారుతున్న రాజకీయ పరిణామాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అమ్మవారి దారకొండ పంచాయతీ సీపీఎంకు పట్టున్న ప్రాంతంగా గుర్తింపు పొందింది. గతంలో 2018లో సీపీఎం నాయకురాలు సంధ్యాకుమారి, 2021లో చంటిబాబు సర్పంచులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరుసగా రెండు పర్యాయాలు ఏకగ్రీవ ఎన్నికలు జరగడంతో పంచాయతీ రాజకీయాల్లో సీపీఎం తనదైన ముద్ర వేసింది. అయితే, ఈసారి పరిస్థితుల్లో మార్పులు కనిపిస్తున్నాయి. పంచాయతీలో కొందరు యువకులు టీడీపీలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, వైసీపీ కూడా సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థిని బరిలోకి దింపే ఆలోచనలో ఉన్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో గతంలో మాదిరిగా ఏకగ్రీవ ఎన్నిక సాధ్యమవుతుందా? లేక వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ తప్పదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల నోటిఫికేషన్, పార్టీల అభ్యర్థుల ఎంపిక, స్థానిక రాజకీయ పరిణామాల ఆధారంగా అమ్మవారి దారకొండ పంచాయతీ ఎన్నికల పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## బాక్సైట్ తవ్వకాలు, హైడ్రోపవర్ ప్రాజెక్టులను అడ్డుకునేందుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం పోటీ

5 మండలాల జడ్పీటీసీ అభ్యర్థులను ప్రకటించిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి అప్పలనరస





**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 19:**అల్లూరి సీతారామరాజు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం పార్టీ పోటీ చేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మీడియాకు తెలిపారు పిఎంఆర్‌సి కొలనీ సిపిఎం ఆఫీసు వద్ద నిర్వహించిన విలేఖరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ.. ఏజెన్సీ 11 మండలాల్లో జడ్పిటిసి స్థానాలకు గాను మొదటి దశలో 5 మండలాల జడ్పిటిసి అభ్యర్థులను, 172 ఎంపిటీసి స్థానాలకు గాను 110 స్థానాలకు పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, మొదటి దశలో 48 మంది అభ్యర్థుల జాబితాను నేడు జరిగిన పార్టీ జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించిందని అన్నారు. అనంతగిరి మండలానికి మహిళా నాయకురాలు దీసరి దేముడమ్మ, అరకువేలి మండలానికి గిరిజన ఉద్యమనేత గెమ్మెలి చిన్నబాబు, డుంబ్రిగుడ మండలానికి కార్మిక ఉద్యమనేత సొనబారికి పోతురాజు, ముంచంగిపుట్టు మండలానికి ఆదివాసీ పోరాట యోధుడు కొర్రా త్రినాథ్, జి.కెవీధి మండలానికి బాక్సైట్ వ్యతిరేక ఉద్యమనేత అంపరంగి బుజ్జిబాబు అభ్యర్థిత్వాన్ని పార్టీ ఆమోదించిందని ప్రకటించారు. కాగా 1/70 చట్టాన్ని ఉల్లంఘించి కార్పొరేట్ కంపెనీలకు బాక్సైట్ మైనింగ్, హైడ్రో పవర్ ప్రాజెక్టులను అప్పగించడాన్ని నిరసిస్తూ దాన్ని అడ్డుకోవడమే ప్రధాన లక్ష్యంగా పార్టీ ఈ ఎన్నికల్లో ప్రచారస్త్రాంగా పెట్టుకొన్నామని అన్నారు. జిల్లాలోని అనంతగిరి, చింతపల్లి, పాడేరు, గూడెంకొత్తవీధి తదితర మండలాల్లో ప్రతిపాదిత బాక్సైట్ తవ్వకాలు, హైడ్రో పవర్ ప్రాజెక్టులు గిరిజనుల జీవనోపాధిని, అడవులను, నీటి వనరులను ధ్వంసం చేస్తాయని సీపీఎం స్పష్టం చేస్తోందని ఈ ప్రాజెక్టుల వల్ల వందలాది గ్రామాలు మునగనున్నాయని, వేలాది గిరిజన కుటుంబాలు నిర్వాసితులు కానున్నాయని పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. స్థానిక సంస్థల్లో గెలుపు సాధించి, ఈ విధ్వంసకర ప్రాజెక్టులను శాశ్వతంగా అడ్డుకునేందుకు సీపీఎం కార్యకర్తలు, గిరిజనులు కలిసి పోరాటం చేస్తామని జిల్లా కమిటీ తెలిపిందనీ, జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీల్లో సీపీఎం అభ్యర్థులు పోటీ చేస్తారనీ, ఆదివాసీ యువతి యువకులకు నూరు శాతం రిజర్వేషన్ కల్పిస్తామనే హామీని కూటమి ప్రభుత్వం, గత ప్రభుత్వం కూడా అమలు చేయకపోవడం తీవ్రమైన నిరుద్యోగుల సంఖ్యపెరుగుతుందన్నారు. యువత సమస్య రెండవ ఎజెండాగా సిపిఎం పార్టీ పనిచేస్తుందని వీటీతో పాటు స్థానిక సమస్యలైనా మౌలిక వసతుల కల్పన కీలకమైన ఎజెండాగా ప్రచారం చేస్తామన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్‌లో రాజ్యాంగబద్దంగా పోరాడుతున్నామని అన్నారు.

ఈ క్యాక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, దీసరి గంగరాజు, బిసిహెచ్ పడాల్,వి ఉమామహేశ్వరరావు, ఎస్‌బి పోతురాజు, కొర్రా త్రినాథ్ పాల్గొన్నారు.

# బ్యాలెట్ పోరుకు.. బాక్సులు రెడీ.

- చింతపల్లిలో ముమ్మరంగా ఎన్నికల ఏర్పాట్లు.
- బ్యాలెట్ బాక్సులను పరిశీలించిన అధికారులు.



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 19.** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు చింతపల్లి మండలంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా, సజావుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాలెట్ బాక్సులను, వాటి పనితీరును సహాయ జిల్లా ఎన్నికల అధికారి లాలం సీతయ్య ఇతర అధికారులతో కలిసి నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా మొత్తం 77 ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎంపీటీసీ స్థానాలకు గులాబీ (పింక్) రంగు, జెడ్పీటీసీ స్థానాలకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తామని, అయితే ఓటర్లు ఈ రెండు ఓట్లను వేర్వేరుగా కాకుండా ఒకే బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.ఒక్కో పోలింగ్ కేంద్రంలో సగటున 932 ఓట్లు ఉన్నాయని, కొన్ని కేంద్రాల్లో ఈ సంఖ్య వెయ్యికి పైగా ఉన్నందున రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రతి కేంద్రానికి రెండు బ్యాలెట్ బాక్సులను కేటాయిస్తున్నట్లు ఆయన వివరించారు. పోలింగ్ సమయంలో మొదటి బాక్స్ నిండిన వెంటనే దానికి పేపర్ సీల్ వేసి, ఓటింగ్ కొనసాగింపు కోసం రెండో బాక్సును వినియోగిస్తామన్నారు. ఈ లెక్కన మండలంలోని 77 కేంద్రాలకు 154 పెద్ద బ్యాలెట్ బాక్సులు అవసరమవుతాయని, అత్యవసర పరిస్థితుల కోసం అదనంగా మరో 10 శాతం (15 బాక్సులు) రిజర్వ్‌లో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తమ వద్ద 190 పెద్ద బాక్సులు సిద్ధంగా ఉన్నాయని, అలాగే సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికల కోసం వినియోగించే చిన్న బాక్సులు సైతం 100 వరకు అందుబాటులో ఉన్నాయని, ఇవి పోలింగ్‌కు సరిపోతాయని స్పష్టం చేశారు. ఎన్నికల పోలింగ్ 3వ తేదీన జరగనున్న నేపథ్యంలో, 2వ తేదీ ఉదయాన్నే డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్దకు ఎన్నికల సిబ్బంది చేరుకుంటారని, అక్కడినుంచి పోలింగ్ సామగ్రిని పటిష్ట భద్రత మధ్య ఆయా కేంద్రాలకు తరలిస్తారని అధికారులు వెల్లడించారు. బ్యాలెట్ బాక్సుల పరిశీలన కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, చింతపల్లి పంచాయతీ అభివృద్ధి అధికారి పలక రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఎన్.టీ. రామారావు, ఎన్నికల సిబ్బంది అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల సాధికారతే లక్ష్యంగా 'బాల పంచాయతీ'.

- విద్య, ఆరోగ్యం, హక్కులపై విస్తృత అవగాహన.
- వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కార్యక్రమాలు.



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబరు 19.** కిషోర బాలికలు ఆత్మవిశ్వాసంతో కూడిన నాయకులుగా ఎదగడమే లక్ష్యంగా మండలంలో సోమవారం నిర్వహించిన 'బాల పంచాయతీ' కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. వాసవ్య మహిళా మండలి 'ఎంపవర్ గర్ల్ చైల్డ్ ప్రాజెక్ట్' ఆధ్వర్యంలో మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీల పరిధిలో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ?సంస్థ ప్రాజెక్ట్ పీడీ సునీతారాణి ఆదేశాల మేరకు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ సుబ్బారావు పర్యవేక్షణలో చింతపల్లి, చౌడుపల్లి, లోతుగెడ్డ, అన్నవరం, తమ్మంగుల, కొమ్మంగి, కొత్తపాలెం, పెద్దబరడ పంచాయతీల్లో ఈ బాల పంచాయతీ సమావేశాలు జరిగాయి. వీటిలో మొత్తం 301 మంది కిషోర బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలికల విద్య, ఆరోగ్యం, హక్కుల పరిరక్షణ, వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై నిర్వాహకులు వారికి అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వంటి దురాచారాలకు దూరంగా ఉండి, చదువును కొనసాగించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు బాలికలకు దిశానిర్దేశం చేశారు. సమాజంలో బాలికలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని వారు స్పష్టం చేశారు. అవగాహన కార్యక్రమాలతో పాటు ఆచరణలోనూ బాలికలు తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. పెద్దబరడ పంచాయతీ పరిధిలోని చింతలూరు గ్రామంలో బాల పంచాయతీ సభ్యులు శ్రమదానం చేశారు. గ్రామంలోని తాగునీటి కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను స్వచ్ఛందంగా తొలగించి పారిశుద్ధ్య మెరుగుదలకు తమ వంతు కృషి చేసి గ్రామస్తులకు ఆదర్శంగా నిలిచారు. ?ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్ సంగీత, కో-ఆర్డినేటర్లు శ్రీదేవి, కుమారి, మహిళా పోలీసు సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వాసవ్య మహిళా మండలి సిబ్బంది, స్థానిక గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చిన్నబరడలో వైభవంగా దుర్గమ్మ ఉత్సవాలు.

కన్నుల పండువగా గరగల ఊరేగింపు.. భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం.



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 19.** మండలంలోని పెదబరడ పంచాయతీ పరిధిలోని చిన్నబరడ గ్రామంలో దసరా నవరాత్రుల సందర్భంగా ఆదివారం రాత్రి దుర్గమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. వరుసగా మూడో ఏడాది నిర్వహించిన గరగల ఊరేగింపు, అగ్నిగుండం కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయబద్ధంగా సాగిన గరగల ఊరేగింపు అనంతరం అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అగ్నిగుండంలో నడుస్తుండగా భవానీ దీక్షాపరులు 'జై భవాని.. జై జై భవాని' అంటూ చేసిన జయజయధ్వానాలతో గ్రామం మార్మోగింది. ఈ వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఉత్సవాలకు హాజరైన భక్తుల కోసం నిర్వాహకులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భవానీ దీక్షా పీఠం ఆధ్వర్యంలో దాతలు, భక్తులు, గ్రామస్తుల సహకారంతో కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన వారందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలన

**కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో**



**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 19 :** ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను విశాఖపట్నం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పెందుర్తి మండల పరిషత్ కార్యాలయాన్ని (ఎంపీపీ కార్యాలయం) సందర్శించి ఎన్నికల సన్నద్ధతను సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో భాగంగా ఓట్ల లెక్కింపు కేంద్రం (కౌంటింగ్ హాల్), బ్యాలెట్ బాక్సులు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన సదుపాయాలు, ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నద్ధతను సమీక్షించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ పర్యటనలో ఎన్నికల ఏర్పాట్ల పురోగతిని పరిశీలించి, సంబంధిత అంశాలను సమీక్షించారు.

# తాను మరణించి జీవించిన మజ్జి రమేష్"



**పుత్రసోకం ఒకవైపు తల్లిదండ్రుల త్యాగం మరోవైపు - ముగ్గురికి పునర్జన్మకు కారణమైన తల్లిదండ్రుల త్యాగం మరువనిది : విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వి. మన్మధరావు**



**విశాఖ తూర్పు, పెన్ పవర్, అక్టోబర్ 19:** పదిహేడేళ్ల వయసు.. చదువు, భవిష్యత్తుపై ఎన్నో కలలు. కానీ రోడ్డు ప్రమాదం ఆ కలలను క్షణాల్లో తుడిచేసింది. అయినా ఆ యువకుడు మరణంలోనూ ముగ్గురికి పునర్జన్మనిచ్చి వెలుగు నింపాడు.అనంతగిరి మండలానికి చెందిన మజ్జి రమేష్ (17) ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు విశాఖలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అత్యాధునిక చికిత్స అందించినా మెదడుకు తీవ్ర గాయం కావడంతో పరిస్థితి విషమించింది. ఈ నెల 18న వైద్యులు బ్రెయిన్ డెడ్ గా ప్రకటించారు.ఆ మాట వినగానే కుటుంబం శోకసాగరంలో మునిగిపోయింది. అయితే ఆ విషాదంలోనూ వైద్యులు వారికి అవయవదానం గురించి వివరించారు. రమేష్ అవయవాలు కొన్ని పనిచేస్తున్నాయని, దానం చేస్తే మరికొందరు బతుకుతారని చెప్పారు."మా బిడ్డ మరో రూపంలో బతకాలి" అని భావించిన తల్లిదండ్రులు పుత్రశోకాన్ని దిగమింగి అవయవదానానికి అంగీకరించారు.వెంటనే ఆసుపత్రి యాజమాన్యం రాష్ట్ర జీవన్ దాన్ సమన్వయకర్త, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వి. మన్మధరావును సంప్రదించింది. ఆయన స్పందించి అనుమతులు మంజూరు చేశారు. జీవన్ దాన్ నిబంధనల ప్రకారం రమేష్ నుంచి రెండు మూత్రపిండాలు, కాలేయాన్ని సేకరించారు. వాటిని అవయవాల కోసం వేచి ఉన్న ముగ్గురు రోగులకు కేటాయించారు. ఇద్దరు కిడ్నీ వ్యాధిగ్రస్తులకు, ఒక కాలేయ వ్యాధిగ్రస్తుడికి ఈ అవయవాలు కొత్త జీవితాన్ని ఇవ్వనున్నాయి.అనంతరం డాక్టర్ మన్మధరావు ఆధ్వర్యంలో వైద్య బృందం, సిబ్బంది రమేష్ భౌతికకాయానికి పూలతో అలంకరించి గౌరవ వందనం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ వి. మన్మధరావు మాట్లాడుతూ.. ఒక వ్యక్తి బ్రెయిన్ డెడ్ తర్వాత చేసే దానంతో 8 మంది వరకు ప్రాణాలు కాపాడవచ్చు. అవగాహన లేక చాలామంది ముందుకు రావడం లేదు. ఇలాంటి సమయంలో ధైర్యంగా నిర్ణయం తీసుకున్న రమేష్ కుటుంబం సమాజానికి ఆదర్శమని అన్నారు.

## 17వ వార్డులో కూటమి అభ్యర్థి బుడుమూరి గోవింద్ ప్రచార జోరు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, అక్టోబర్ 19:**జీవీఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 17వ వార్డు కూటమి అభ్యర్థి బుడుమూరి గోవింద్ సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుపై పోటీ చేస్తున్న ఆయన తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మద్దతుతో ప్రచారం చేస్తున్నారు.పెదగదిలి, సింహగిరి కాలనీ, ప్రశాంత్ నగర్, పోలమాంబ ఆలయ ప్రాంతం, ఈశ్వరదేవి నగర్, సాయిబాబా ఆలయ ప్రాంతం, చిన్నగదిలి ప్రాంతాల్లో పాదయాత్ర చేసి ఓటర్లను కలిశారు. ఈ నెల 28న జరిగే జీవీఎంసీ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణికి, 17వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 17వ వార్డు పరిధిలో దేవస్థానం భూముల సమస్య ప్రధానంగా ఉందని, దాని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాగునీటి సమస్య పరిష్కారం, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, కొండ ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణంపై దృష్టి సారిస్తానని తెలిపారు. గత పదేళ్లుగా ఆరిలోవ ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని, అవకాశం ఇస్తే వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గంభీరం ఎంపీటీసీ స్థానం కేటాయించాలని గంటా శ్రీనివాసరావుకు బీజేపీ నాయకుల వినతి



**భీమిలి, పెన్ పవర్ 19 అక్టోబర్:**భీమిలి నియోజకవర్గ శాసనసభ్యుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును బీజేపీ నాయకులు సోమవారం విశాఖపట్నంలోని ఎంవీపీ కాలనీలో ఉన్న ఆయన పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ విశాఖ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వర్షం వెంకట్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు ఆయనను కలిసి పలు అంశాలపై చర్చించారు.ముందుగా గంటా శ్రీనివాసరావును దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి, ఆధ్యాత్మిక దైవ చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ నుంచి రాబోయే ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని కోరుతూ వర్షం వెంకట్ వినతిపత్రాన్ని సమర్పించారు.కూటమిలో భాగంగా గంభీరం ఎంపీటీసీ స్థానాన్ని తనకు కేటాయించాలని ఆయన వినతిపత్రంలో అభ్యర్థించినట్లు తెలిపారు. అనంతరం గంటా శ్రీనివాసరావుతో ఆనందపురం మండల రాజకీయ పరిస్థితులపై నాయకులు కొద్దిసేపు చర్చించారు.ఈ కార్యక్రమంలో ప్రసాద్ పట్నాయక్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## గూడెంకొత్తవీధి సర్పంచ్ అభ్యర్థిత్వంపై కోర్ర రాంబాబు ఆసక్తి

పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పించాలని విజ్ఞప్తి



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 19:** గూడెంకొత్తవీధి పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే అవకాశాన్ని కోర్ర రాంబాబు ఆశిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా కొనసాగుతూ, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని ఆయన తెలిపారు.పార్టీ కార్యకర్తలతో కలిసి పనిచేస్తూ ప్రజలతో మమేకమవుతున్నానని పేర్కొన్న ఆయన, తన సేవలను పరిగణనలోకి తీసుకొని సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరుతున్నారు. పార్టీ నాయకత్వం తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించి అవకాశం ఇస్తే, ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.అయితే, సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై పార్టీ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఎన్నికల సంఘం ప్రకటించే నిబంధనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా తదుపరి రాజకీయ పరిణామాలు ఉండనున్నాయి.

# దబ్బకోటలో ఘనంగా దసరా వాలీబాల్ పోటీలు

**విజేత జట్లకు నగదు బహుమతుల ప్రదానం**




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 19:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దారకొండ పంచాయతీ పరిధిలోని దబ్బకోట గ్రామంలో దబ్బకోట యూత్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజయవంతంగా కొనసాగింది. ఈ పోటీల్లో పలు గ్రామాలకు చెందిన క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.వాలీబాల్ పోటీల్లో మొదటి బహుమతిగా రూ.5,000ను దబ్బులవాడ పంచాయతీ పరిధిలోని బంధవీధి గ్రామ జట్టు అందుకుంది. రెండో బహుమతి రూ.3,000ను వలసగడ్డ గ్రామ జట్టు దక్కించుకుంది. మూడో బహుమతిని సీలేరు ఎస్సై బాలు, నెట్టు అందించగా, గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని కాకనూరు గ్రామ జట్టు అందుకుంది.ఈ కార్యక్రమంలో గోవిందరాజు, జగన్, కృష్ణారావు, మల్లు దొర, జగన్నాథం, సుందర్ రావు, చీర్ల రమేష్ (కాంట్రాక్టర్), ధర్మ, రాంబాబు, కృష్ణ, నాగేశ్వరరావు, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడంతో పాటు యువతలో క్రీడాస్ఫూర్తి, స్నేహభావం పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు దోహదపడతాయి.

# 14వ వార్డులో కూటమి అభ్యర్థి ఇంటింటి ప్రచారం -



- ఓటర్లను కలిసిన టీడీపీ అభ్యర్థి కాకి గంగరాజు

**విశాఖ తూర్పు, పెన్ పవర్ అక్టోబర్ 19:** విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధిలోని 14వ వార్డులో కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాకి గంగరాజు ఆదివారం ప్రచారం నిర్వహించారు.వార్డు పరిధిలోని ప్రియదర్శినీ కాలనీ, బాలాజీ నగర్, పాత ఆరిలోవ, వికలాంగుల కాలనీ ప్రాంతాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, వార్డు ఇన్‌ఛార్జ్ రాగతి అచ్యుతరావు,జనసేన వార్డు అధ్యక్షుడు సారిపల్లి రాము, కూటమి నాయకులు మూది అప్పారావు,ముదిండి కృష్ణంరాజు,రేఖా జ్యోతి, పేపర్ నాయుడు, ఆదినారాయణ రాజు,చందక లలిత, ఫిరోజ్ బాబు, గౌరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నగర మేయర్ అభ్యర్థిత్వం ఆశిస్తున్నా

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని సాగనంపాలి
- వైసిపి రాష్ట్ర నాయకుడు నక్కా శ్రీ నగేష్ పిలుపు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 19:**ఆనాటి కాంగ్రెస్ పార్టీ నుంచి నేటి వైసిపి వరకు 40 సంవత్సరాల పాటు రాజకీయాల్లో కొనసాగుతున్నానని, వర్గాలకతీతంగా వైసీపీలో సీనియర్ నాయకునిగా కొన సాగుతున్న తాను రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పదవి ని ఆశిస్తున్నానని వైసిపి రాష్ట్ర నాయకుడు నక్కా శ్రీ నగేష్ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రిజర్వేషన్ రోస్టర్ విధానం లో తిరిగి కార్పొరేషన్ ఎస్సీ జనరల్ కావడం పై హర్షం వ్యక్తం చేస్తూ మేయరు పదవికి స్థానికుడిగా, సీనియర్ రాజకీయ నాయకుడిగా తాను అన్ని విధాల అర్హుడనని, పార్టీ అధిష్టానం తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. తనకు పార్టీలోని రెండు వర్గాలు మద్దతు ఉందని, ఇప్పటికే పెద్దవాళ్ళను కలిసినట్లు ఆయన తెలిపారు. ఏదేమైనా పార్టీ అధిష్టానం నిర్ణయాన్ని గౌరవిస్తానని, పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. మతతత్వ బిజెపి పార్టీని నగర ప్రజలు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

### రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల నామినేషన్లు వేయకుండా భయభ్రాంతులకు గురిచేస్తుందని విమర్శించారు.
ఎన్నికలను స్వేచ్ఛాయితంగా నిష్పక్షపాతంగా జరిపించాల్సిన రాష్ట్ర ఎన్నికల కమిషన్, పోలీస్ వ్యవస్థలు ప్రభుత్వానికి బానిసలుగా మారిపోయాయని విమర్శించారు. కూటమిలో తెలుగుదేశం పార్టీ యే కీలకమని, ఆ పార్టీ చేస్తున్న ప్రధానంగా ఆ పార్టీ చేస్తున్న అరాచకాలను జనసేన పార్టీ పవన్ కళ్యాణ్ ప్రశ్నించాలని కోరారు. పురపాలక ఎన్నికల నామినేషన్లో టిడిపి హింసను ఖండిస్తున్నామన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని సాగనంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

స్థానిక ఎన్నికల్లో పోటి చేయ అభ్యర్థులకు పార్టీ ఆహ్వానం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 19:**ఆంధ్రప్రదేశ్ లో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రజలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ పిలుపు నిచ్చారు.
(అర్పిసి) ప్రధాన కార్యాల యంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశానికి అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశం లో మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ,
పల్నాడు జిల్లా వినుకొండ మున్సిపల్ చైర్మన్ పోటీ కి అర్పిసి అభ్యర్దిగా షేక్ మస్తాన్ వల్లి పసుమర్తి బెదిరింపులు , ఒత్తిడిలను తట్టుకుని నామినేషన్ దాఖలు చేసారన్నారు. కూటమి పార్టిల బెదిరింపులకు అర్పిసి అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయలేక పోయారన్నారు. దౌర్జన్యాలు, దాడులతో అభ్యర్థులను బెదిరిస్తు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుంటే ఎన్నికల సంఘం, పోలీస్ యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవ హరిస్తుదని విమర్శించారు.

### అభ్యర్థులకు పార్టీ ఆహ్వానం...

స్థానిక ఎన్నికల్లో పోటి చేయ అభ్యర్థులకు పార్టీ ఆహ్వానం పలుకుతుందని , పోటీ చేసే అభ్యర్థులు పార్టీ సిద్ధాంతాలకు లోబడి, ప్రజా సేవలో చిత్తశు ద్ధి, నిస్వార్ధత కలవారు ముందుకు రావాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సేవలు, పరిశుభ్ర మైన త్రాగునీరు, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య , ఆస్తి పన్నుల వసూళ్లలో పారదర్శకత, అంటువ్యాదులు ప్రబలకుండా శాస్త్రీయ చర్యలు , పర్యావరణాన్ని రక్షించే చర్యలు, ప్లాస్టిక్ రహిత , నకిలీలకు తావు లేని నిత్యావసర సరుకుల విక్రయాలు, ప్రతి ఇంటికి పండ్ల చెట్లు పంపిణీ , మెరుగైన ప్రభుత్వ పౌర సేవలు, మౌలిక సౌకర్యాలు అన్ని వర్గాల ప్రజలకు సమానంగా అందేలా కృషి , పౌర హక్కులకు, న్యాయ సహాయ చర్యలను
ప్రజలకు సేవలందించాలని
సిద్దపడేవారు పోటికి సంశిద్దతగా వుండాలన్నారు.

### మున్సిపల్ ఎన్నికల అభ్యర్థులకు రుసుము...

జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో పోటి చేయు అభ్యర్థులకు పార్టి ధరవత్తు చెల్లిస్తుందని, ఏ , బి ఫామ్ లు, ఎన్నికల గుర్తుగా గ్యాస్ సిలెండర్ ను అధికారికంగా జారి చేస్తామన్నారు. పోటి చేయు అభ్యర్థులు పార్టీ సాధారణ, క్రియాశీలక సభ్యత్వం తీసుకోవాలన్నారు.
సామాజిక భాద్యత గల వారిని రాజకీయంగా ప్రోత్సహిస్తా మన్నారు. ఆసక్తి గలవారు కేంద్ర కార్యాలయ చిరునామా కు తమ పూర్తి వివరములను పంపించాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల గుర్తు గ్యాస్ సిలెండర్ పోస్టర్ ను ఆవిష్కరించారు.
ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ డి వి రమణమూర్తి , బర్ల ప్రసాద్ , దుడ్డే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్, దోషి నిషాంత్ , మేడిచర్ల శ్రీనివాసరవు , వాడపల్లి జ్యోతిష్ , శీతిన సురేష్ , పిట్టా శ్రీనివాస్ , మట్టపర్తి తులసి , పంద్రంగి ఈశ్వరరావు , కాకర ప్రసాద్ , కందివలస రమణ, మాసా అప్పయమ్మ , కొమ్మోజు రమ్య, చల్లా వంశీ , తదితరులు పాల్గొన్నారు .

# ఎన్నికల పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు

- జిల్లా, మండల స్థాయుల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- రెండు షిఫ్టుల్లో సిబ్బంది నియామకం.. ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక నిఘా
- ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు పెద్దపీట
- పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 19:**స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పోలవరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు జిల్లా, మండల స్థాయుల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, జిల్లా పరిషత్ కార్యాలయంతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో కంట్రోల్ రూమ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు.

### రెండు షిఫ్టుల్లో సిబ్బంది విధులు

ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలను ఎప్పటికప్పుడు స్వీకరించి పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్‌లలో రెండు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరగకుండా నిర్ణీత సమయంలో చర్యలు తీసుకునేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, విధుల నిర్వహణలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

### ఫిర్యాదుల కోసం ప్రత్యేక ఫోన్ నంబర్లు

ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలను ప్రజలు నేరుగా తెలియజేసేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ వెల్లడించారు.
కలెక్టరేట్ కంట్రోల్ రూమ్: 1800-425-4225
జిల్లా పరిషత్ కార్యాలయం: 9441123704
ఈ నంబర్ల ద్వారా ఎన్నికలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

రంపచోడవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో నియమించిన సిబ్బంది

రంపచోడవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాలకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు.
అడ్డతీగల: సీనియర్ అసిస్టెంట్ కె. రవి హసన్ దొర (8500432069), జూనియర్ అసిస్టెంట్ జి. అనురాధ (8500997625).
గంగవరం: సీనియర్ అసిస్టెంట్ ఆర్. శైలత (9951219144), టైపిస్ట్ డి. అభిరామ్ (7901698501).
దేవీపట్నం: సీనియర్ అసిస్టెంట్ డి.వి. శ్రీనివాస్ (8639033306), జూనియర్ అసిస్టెంట్ వి. మోనిష్ వెంకట సాయి కుమార్ (9133678991).
గుర్తేడు: పాతకోట డబ్ల్యూఈఏ జి. బాలచంద్రుడు (9490521783), దారగడ్డ డబ్ల్యూఈఏ ఎల్. జయప్రసాద్ (9493957122).
మారేడుమిల్లి: సీనియర్ అసిస్టెంట్ కె.పి. ఆనంద్ (9490340866), జూనియర్ అసిస్టెంట్ ఛి.వి.ఎస్. కిరణ్ (9494002480).
రాజవొమ్మంగి: సీనియర్ అసిస్టెంట్ కె. సిరిల్ పాల్ (7075081973), టైపిస్ట్ ఇ. నాగలక్ష్మి (8555933534).
రంపచోడవరం: జూనియర్ అసిస్టెంట్ కె. వరలక్ష్మి (6300611241), పీఎస్-ఎ డి. వేణు (6305180978).
వై. రామవరం: సీనియర్ అసిస్టెంట్ జి. కరుణాధరం (9440917994), జూనియర్ అసిస్టెంట్ కె. కృపావరం (9440588638).

చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో నియమించిన సిబ్బంది
చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఎన్నికల ఫిర్యాదుల స్వీకరణ, పర్యవేక్షణ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించారు.
చింతూరు: టైపిస్ట్ ఎం. శివ వరప్రసాద్ దొర (8332922019), జూనియర్ అసిస్టెంట్ కె. జయ (8367462968).
కూనవరం: జూనియర్ అసిస్టెంట్ ఆర్. చక్రవర్తి (7396767031), జూనియర్ అసిస్టెంట్ వై. జయకుమార్ రాజ్ (9491279638).
వర రామచంద్రపురం: జీఎంఎస్కే సాయి కుమారి (8179376398), వడ్డిగూడెం డీఏ బి. బాలరాం (9493465523).
ఏటపాక: జూనియర్ అసిస్టెంట్ ఎస్. శ్రీనివాస్ (6301081937), రికార్డు అసిస్టెంట్ బి. జాకబ్ రాజు (9391472744).



### ఎన్నికల ఫిర్యాదులపై తక్షణ చర్యలు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాతానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రజలు ఎదుర్కొనే సమస్యలు, ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌లకు అందే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని సూచించారు.జిల్లాలోని అన్ని మండలాల ప్రజలు ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలను తమ మండలాలకు కేటాయించిన సిబ్బందికి లేదా జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్‌లకు తెలియజేయాలని కోరారు. ప్రజల సహకారంతో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ కె. దినేష్ కుమార్ వెల్లడించారు.

# కనకదుర్గమ్మ దేవి అలంకరణలో విజయదుర్గమ్మ దివ్యదర్శనం.





- భవానీలు, మహిళలతో కళా శాల ఊరేగింపు
- ఆరుగొలనులో ఆధ్యాత్మిక వైభవం.. కనులపండువగా శ్రీనివాస మంగ, పద్మావతుల కల్యాణం

**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. అక్టోబర్ 19:**తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో కొలువైన విజయదుర్గ అమ్మవారు కనకదుర్గమ్మ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.
వేదమంత్రాల నడుమ ఆధ్యాత్మిక పరిమళాలు.. భక్తుల జయజయధ్వానాల మధ్య అమ్మవారి దివ్యమంగళ స్వరూపం.. చిన్నారుల కోలాహలంతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో పులకించిపోయింది. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా జ్ఞానప్రదాయిని అయిన సరస్వతీ దేవి రూపంలో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించడంతో ఆలయం ఆధ్యాత్మిక కళను సంతరించుకుంది.

### చిన్నారులతో ఆలయంలో సందడి

విద్యాబుద్ధులు, జ్ఞానం, వివేకం ప్రసాదించే సరస్వతీ దేవి అనుగ్రహం కోసం గ్రామంలోని చిన్నారులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజలు నిర్వహించారు. తమ పిల్లలు విద్యలో రాణించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తల్లిదండ్రులు అమ్మవారిని వేడుకున్నారు. చిన్నారుల రాకతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

### వైభవంగా శ్రీనివాస మంగ, పద్మావతుల కల్యాణం

రాత్రి శ్రీనివాస మంగ, పద్మావతుల కల్యాణ మహోత్సవాన్ని కనులవిందుగా నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ, వేదమంత్రాల సాక్షిగా సాగిన కల్యాణ వేడుక భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. స్వామివారి కల్యాణాన్ని తిలకించిన భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. లోకకల్యాణం, సకల జనుల సుఖసంతోషాలు, గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని భక్తులు వేడుకున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ నూకల బుల్లియ్య, నూకల ధనకృష్ణ ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారి దివ్యదర్శనం, చిన్నారుల ప్రత్యేక పూజలు, రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవంతో ఆరుగొలను గ్రామం భక్తి, ఆధ్యాత్మికతలతో అలరారింది.

# బాధితులు కుటుంబానికి రూ.1,00,000 "సత్యం"సాయం!



**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 19:**సీతానగరం మండలం శ్రీరామనగరం గ్రామానికి చెందిన ఏపుగంటి భీమరాజు ఇటీవల తేనెటీగలు కుట్టడం వల్ల మృతి చెందడంపై ఇనుగంటివారిపేట మాజీ సర్పంచ్, వైయస్సార్సీపి నాయకుడు సత్యం రాంపండు సోమవారం సాయంత్రం బాధితుడు కుటుంబానికి రూ. లక్ష రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా రాంపండు మాట్లాడుతూ ఇనుగుంటివారి పేటకు చెందిన పార్థసారథి అనే రైతు ఇంజన్ మరమ్మత్తులు చేయించుకునేందుకు భీమరాజును తీసుకెళ్లిన సమయంలో తేనెటీగలు దాడిలో ఆ రైతు పార్థసారథి తప్పించుకోవడం అక్కడే ఉన్న భీమరాజు మృతి చెందడం ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంపై ఈ ప్రాంతంలో ఒక బలమైన సామాజిక వర్గం తీవ్ర ఆందోళన చేపట్టిందన్నారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునేలా తన వంతు సహకారం అందించా మన్నారు. బాధితుడి కుటుంబం పరిస్థితిపై మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దృష్టికి తీసుకెళ్లామని ఆయన కూడా కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునేలా ముందుకొచ్చారన్నారు. వైఎస్ఆర్సిపి తరపున ఒక బలమైన సామాజిక వర్గం ద్వారా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని రాంపండు స్పష్టం చేశారు.

# మహిషాసురమర్ధిని దేవిగా దేవి మహంకాళమ్మతల్లిని అలంకరణ



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 19.**తాడేపల్లిగూడెం ఏలూరురోడ్డులోని శ్రీదేవి మహంకాళమ్మతల్లి 8వ వార్షిక ఆదసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు, సోమవారం , దశమి నాడు శ్రీ మహిషాసురమర్ధిని దేవిగా శ్రీదేవి మహంకాళమ్మతల్లిని అలంకరించారు.
అమ్మవారి అలంకరణ పంతం సత్యనారాయణగారు, శ్రీ పంతం సూర్యనారాయణ మరియు శ్రీమతి సుబ్బలక్ష్మి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ సన్నిధిలో శ్రీ లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు.
ఈ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలును శ్రీదేవి మహంకాళమ్మతల్లి ఆలయ స్థాపకులు మరియు నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ ను అధ్యక్షులు యెగ్గిన నాగబాబు మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

# గంగవరంలో వైభవంగా సామూహిక కుంకుమ పూజలు

- దేవీ నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు
- వేద మంత్రోచ్చరణల నడుమ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న గంగవరం
- సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న 200 మంది మహిళలు



**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 19:**దసరా ఉత్సవాలు, దేవీ నవరాత్రులను పురస్కరించుకుని గంగవరం మండల కేంద్రంలో సోమవారం సామూహిక కుంకుమ పూజా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం భక్తిశ్రద్ధలు, వేద మంత్రోచ్చరణలు, అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సుమారు 200 మంది మహిళలు ఒకేచోట సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రాజమహేంద్రవరం వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం, ధర్మ రక్షా సమితి, సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజన అర్చకులు కడబాల ఆదివిష్ణు, కురసం గంగరాజు వేద మంత్రోచ్చరణల మధ్య సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ఆరాధించి కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి అనుగ్రహంతో తమ కుటుంబాలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.

**ఆధ్యాత్మిక ఐక్యతకు వేదికగా సామూహిక పూజలు**

దేవీ నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలు మహిళల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి. గిరిజన అర్చకుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణలతో పూజలు నిర్వహించడం కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించడంలో ఇటువంటి సామూహిక పూజా కార్యక్రమాలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం ప్రాంత సంయోజిక ఇ. పద్మావతి దంపతులు, విశ్వనాథ్ శర్మ దంపతులు, సత్తిరాజ్, మురళీకృష్ణ, ఆర్వీబీ పట్నాయక్, బండి శ్రీనివాసరావు, సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) సభ్యులు విశ్వనాథ్ రెడ్డి, చెల్లన్నదొర, కత్రం చిన్నాలరావు దొర, బోయిన అబ్బాయిరెడ్డి, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

**భక్తులకు అన్నప్రసాద వితరణ**

సామూహిక కుంకుమ పూజా కార్యక్రమం ముగిసిన అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. పూజల్లో పాల్గొన్న మహిళలు, భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం, ధర్మ రక్షా సమితి, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు సమన్వయంతో కృషి చేశారు. భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక వాతావరణం నడుమ సామూహిక కుంకుమ పూజా కార్యక్రమం ఘనంగా ముగిసింది.

## స్వచ్ఛమైన పరిసరాలే ఆరోగ్య పరిరక్షణ, సూత్రం.




**లయన్ బడుగు చంద్ర శేఖర్.**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 19.**మన పరిసరాలు శుభ్రం గా ఉంచాల్సిన బాధ్యత మనదే అని అపరిశుభ్రతే అనేక రోగాలకు మూలకారణమని తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ డైరెక్టర్ లయన్ బడుగు చంద్ర శేఖర్ అన్నారు..డైమండ్స్. వనిత లయన్స్ ఆధ్వర్యంలో గుణ్ణం ఫంక్షన్ హాల్ వద్ద స్వచ్ భారత్ లో భాగంగా పరిసరాల ను శుభ్రపరిచారు లయన్స్జిల్లా 316జి జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ దశక సుబ్బారావు రిజియన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణం రాజు పిలుపు మేరకు యోగా సెంటర్స్ లో విజయదశమి సందర్భంగా పచ్చదనం పరిశుభ్రత స్వచ్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. అలానే కేన్సర్ కి మూల కారణం ఐన ప్లాస్టిక్ వినియోగం మానాలని అలానే పేపర్ గ్లాస్ లులో ప్లాస్టిక్ కవర్స్ లో వేడి వస్తువులు ఉపయోగించద్దు అని అవగాహన కార్యక్రమం చేపట్టామ్మన్నారు రీజయన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ సామజిక రుగ్మతలు ముఖ్యంగా ఇంట్లో చెత్త డ్రెయిన్ లో వీధిలో వేయడం మానుకోవాలని ప్రభుత్వం ఎంత ప్రచారం చేసినా ఆ పరిస్థితి లో మార్పు లేదని దీనిపై అంతర్జాతీయ లయన్స్ క్లబ్ అలుపెరగని పోరాటఓ చేస్తుంది అని ఇలా స్వచ్ఛమైన పరిసరాలు కావాలని ఇలాంటి అవగాహన కార్యక్రమం లకు ప్రజల మద్దతు అవసరం అన్నారు. ఈ కార్యక్రమం లో దాసం వెంకటరమణ బహురోజు బాల సుధాకర్ చల్లంచర్ల శ్రీనివాస్ పట్నాల రామకృష్ణ డైమండ్స్ క్లబ్ ప్రసిడెంట్ శ్రీ, చెన్నా రెడ్డి సతీష్ వనిత సెక్రెటరీ కాళ్ళ అరుణ కుమారి, ప్రశాంతి. ఝాన్సీ. లక్ష్మి లలిత ధనలక్ష్మి. యోగా సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి గెలుపు ఖాయం



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, అక్టోబర్ 19;** పోలవరం నియోజకవర్గం లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలాన్ని నిరూపించి గెలుపు లక్ష్యంగా ఉన్నట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. సోమవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు ఎంపికపై మూడు పార్టీల ముఖ్య నాయకులతో చర్చించి వెల్లడిస్తామని అన్నారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషి చేసి అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి ,ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసు, కూటమి నాయకులు శీలం వెంకటేశ్వరరావు, జయవరపు శ్రీరామమూర్తి, పారేపల్లి రామారావు, ఉండవల్లి సోమసుందరం, సుంకవల్లి సాయి, బండారు అనిల్, జాస్తి సత్యనారాయణ ,గుడెల్లి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహిషాసురమర్దిని దేవి అలంకారంలో శ్రీ కనకదుర్గమ్మ దర్శనం



**తాళ్ళపూడి, పెన్ పవర్, అక్టోబర్ 19:**తాళ్ళపూడిలోని ప్రసిద్ధ శ్రీ నవదుర్గాది పరివార శ్రీ చక్ర సహిత శ్రీ కనకదుర్గ అమ్మవార్ల దేవాలయంలో 25వ దసరా మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ కనకదుర్గ అమ్మవారు శ్రీ మహిషాసురమర్దిని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహోత్సవాలను పురస్కరించుకుని ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు శోభాయమానంగా దర్శనమివ్వడంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నీలి సూర్యనారాయణ, నీలి శ్రీనివాస్ మాట్లాడుతూ... 25వ దసరా మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులందరూ శరన్నవరాత్రి ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ కృపాకటాక్షాలు, ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తాళ్ళపూడి మండల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సింహాద్రి జనార్ధనరావు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కూనవరంలో వైసిపి - సిపిఎం పొత్తు ఖరారు...



**జడ్పిటిసి వైసిపి,ఎంపీపీ సిపిఎంకు**

**కూనవరం,పెన్ పవర్,అక్టోబర్21.** జడ్పిటిసి,ఎంపీపీ స్థానిక ఎన్నికల పొత్తుల్లో భాగంగా కూనవరం మండలంలో వైసీపీ,సిపిఎం పార్టీల మధ్య సయోధ్య కుదరడంతో ఎన్నికల పొత్తు ఖరారైంది.పొత్తులో భాగంగా జడ్పీటీసీ అభ్యర్థిగా వైసీపీ,ఎంపీపీ అభ్యర్థిగా సిపిఎం నుంచి పోటీ చేయాలని ఇరు పార్టీలు నిర్ణయించాయి.పదవుల కేటాయింపులో భాగంగా వైస్ ఎంపీపీ,కో ఆప్షన్ పదవులను వైసీపీకి కేటాయించారు.సిపిఎం కి నాలుగు,వైసీపీకి నాలుగు ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేయాలని పార్టీలు నిర్ణయించారు.ఇరు పార్టీల మధ్య కుదిరిన పొత్తులో భాగంగా మండలంలో ఎన్నికల పోటీకి సంబంధించి సీట్ల సర్దుబాటు ఖరారైంది.ఈ కార్యక్రమంలో వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల మర్యాద దాసు,మండల అధ్యక్షులు ఆలూరి కోటయ్య,గుజ్జా బాబు, సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు,సిపిఎం మండల కార్యదర్శి బాబు బోర్రయ్య,తలగాని నాగరాజు,తాళ్లూరి శ్రీను తదితరు లు పాల్గొన్నారు.

## యార్లగడ్డ పోలింగ్ స్టేషన్ ను పరిశీలించిన ఆర్ ఓ



**వై రామవరం, పెన్ పవర్, అక్టోబర్ 19 :** మండలంలోని యార్లగడ్డ పోలింగ్ స్టేషన్ ను రిటర్నింగ్ ఆఫీసర్ బి నరేంద్ర కుమార్ సోమవారం పరిశీలించారు.
త్వరలో జరగబోవు సాధారణ ఎన్నికలకు సంబంధించి పరిశీలించడం జరిగిందన్నారు. ఆర్ వో వెంట ఎంపీడీవో కే. బాబన్నదొర, ఎస్సై పృద్వి యాదవ్, తహసిల్దార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పిండికొండ వీధిలో ఘనంగా దుర్గామాత విగ్రహ ఊరేగింపు

- కోలాటాలు, భజన గీతాలతో మార్మోగిన గ్రామాలు
- అమ్మవారి ఊరేగింపులో మహిళల ప్రత్యేక ఆకర్షణ



**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 19:**దసరా ఉత్సవాలను పురస్కరించుకుని గంగవరం మండలం పిండికొండ వీధి గ్రామంలో దుర్గామాత విగ్రహాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఊరేగించారు. పిండికొండ వీధి, చలక వీధి, లక్కొండ, పాత గంగవరం, కొత్త గంగవరం గ్రామాల మీదుగా అమ్మవారి విగ్రహ ఊరేగింపు భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ సందర్భంగా గ్రామాలన్నీ భక్తిపారవశ్యంతో మార్మోగాయి. ముఖ్యంగా పిండికొండ వీధి గ్రామానికి చెందిన మహిళలు సంప్రదాయ కోలాటాలు, భజన గీతాలు, నృత్యాలతో అమ్మవారి ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దుర్గామాత నామస్మరణతో గ్రామ వీధులు మార్మోగగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. మహిళల కోలాటాలు, భక్తిగీతాలతో ఊరేగింపు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది.గ్రామ పెద్దలు జోగి రెడ్డి, సంకుర్ రెడ్డి, చిన్నబ్బాయి రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఊరేగింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి దుర్గాలక్ష్మి, మురళి మంగయమ్మ, రోలిపల్లి సరస్వతి, రెడ్డి పెంటమ్మ, యాట్ల భద్రమ్మ, యాట్ల నాగమణి, యాట్ల లక్ష్మి, లింగం దేవి, రెడ్డి ఆదిలక్ష్మి తదితర మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తుల సమష్టి సహకారంతో దుర్గామాత విగ్రహ ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది.

## పాము కాటు బాధితురాలి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

- సకాలంలో స్పందించి యాంటీ స్నేక్ వెనమ్ అందించిన ఈఎంటీ చిన్నబ్బులు
- 108 సిబ్బంది సేవలను అభినందించిన గ్రామస్తులు



**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 19:**పాము కాటుకు గురైన బాలిక కు సకాలంలో అత్యవసర వైద్యసేవలు అందించి ప్రాణాపాయం నుంచి కాపాడటంలో 108 అంబులెన్స్ సిబ్బంది కీలక పాత్ర పోషించారు. గంగవరం మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన సుస్మిత అనే బాలిక తాచుపాము కాటుకు గురికాగా, సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే స్పందించి బాధితురాలికి ప్రాథమిక చికిత్స అందించారు.ప్రభుత్వం అత్యవసర వైద్యసేవల్లో భాగంగా 108 అంబులెన్స్‌లలో అందుబాటులో ఉంచిన యాంటీ స్నేక్ వెనమ్ (ఏఎస్వీ) ఔషధాన్ని అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుడు (ఈఎంటీ) బి. చిన్నబ్బులు బాధితురాలికి అందించారు. ఈ ప్రక్రియలో అంబులెన్స్ పైలట్ చందు సహకరించారు. సకాలంలో వైద్యసేవలు అందించడంతో బాధితురాలు ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు తెలిపారు.
అనంతరం బాధితురాలిని మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం గంగవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పాము కాటు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు తక్షణ వైద్యసేవలు అందించి విలువైన ప్రాణాలను కాపాడాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా 108 సిబ్బంది సేవలందిస్తున్నారు. పాము కాటుకు గురైన బాలిక కు సకాలంలో స్పందించి వైద్యసేవలు అందించిన ఈఎంటీ బి. చిన్నబ్బులు, పైలట్ చందు సేవలను మర్రిపాలెం గ్రామస్తులు అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలు గ్రామీణ ప్రజలకు ప్రాణరక్షకంగా నిలుస్తున్నాయని పలువురు పేర్కొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com